జనరాజకీయం కోసం ...

₹ 10/-

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి - 3 సంచిక - 12 పక్షపత్రిక జూన్16-30, 2012

## కొత్త పాలసీ: మద్య నియంత్రణకు మార్గం కాదు




CPI (M) CPI

## రాష్ట్రంలో రాజకీయ పునరేకీకరణ జరగాలి



వరంగల్ లో లోక్‌సత్తా టైమ్స్ ఎన్నికల ప్రత్యేక సంచిక ఆవిష్కరణ



పరకాల ఉప ఎన్నికల్లో అక్రమాలపై ఎన్నికల పరిశీలకులు
వల్లార్‌కి వరంగల్‌లో ఫిర్యాదు ఇచ్చిన లోక్‌సత్తా నాయకులు



తణుకులో లోక్‌సత్తా శిక్షణా తరగతులు




కాకినాడ అగ్నిప్రమాదంలో బాధితులకు
దుస్తుల పంపిణీ చేస్తున్న లోక్‌సత్తా నాయకులు



పెట్రోల్ ధరల పెంపుకు నిరసనగా అనంతపురంలో ప్రదర్శన



పరకాల అమరధామం ముందు డా॥ జేపీ



'దేశం కోసం రైతు... రైతు కోసం ఎవరు?' వ్యాస సంకలనాన్ని హైదరాబాద్‌లో విడుదల చేస్తున్న కేంద్ర మంత్రి అజిత్‌సింగ్,
కేంద్ర సహాయ మంత్రి పురందరేశ్వరి, జయప్రకాష్ నారాయణ్, వడ్డే శోభనాద్రీశ్వర రావు, శివాజీ తదితరులు

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక జూన్16-30, 2012

సంపుటి - 3 సంచిక - 12

## లోపలి పేజీల్లో...

రాజకీయ శక్తుల పునరేకీకరణ జరగాలి.... 5
రాష్ట్రపతి ఎన్నికను మసిబారుస్తున్న.......... 7
జగన్ విజయ రహస్యం ఏమిటి?.............. 9
జగన్‌ది ఎవరెస్టంత అవినీతి.................... 12
లోక్‌సత్తాతో అవగాహనకు ప్రాతిపదిక వుంది.... 15
తప్పెవరిది............................................. 16
జేపీపై వరవరరావు విజ్ఞత లేని విమర్శ....... 17
తాగినోడి నోట నిజం తన్నుకుని వస్తాదన్నా..... 18
జిన్నా ప్రసంగంలో ఏముంది?................. 20
పాము చుట్టం - తోక పగ...................... 22
మరో జలియన్ వాలాబాగ్..................... 24
పోరాటాలకు స్ఫూర్తి వీర బైరాన్‌పల్లి......... 26
స్ఫూర్తిదాయకం పరకాల అమరధామం... 28
వరి మద్దతు ధర పెంపు.......................... 29
ఈ పెంపు ఏ మూలకు........................... 30
నిధుల స్వాహాకు అడ్డుకట్ట....................... 31
ప్రైవేటుకు విద్యార్థుల వలస..................... 32
లోక్‌సత్తా పార్టీ కార్యక్రమాలు................ 33

## సంపాదకవర్గం

డా॥ జయప్రకాష్ నారాయణ్
ప్రధాన సంపాదకులు

డి.వి.వి.యస్. వర్మ
సంపాదకులు

సంపాదక వర్గం

జి. రాజారెడ్డి
బండారు రామ్మోహన్‌రావు
కొంగర గంగాధరరావు
కె.వి. కుటుంబరావు
సి.హెచ్.ఎస్. మాధవరావు

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి
డి.టి.పి : జ్యోతి తాటి
ఫొటోలు : ఎన్. సంజీవ్ కుమార్

# కొండంతరాగం తీసి

## మద్యనియంత్రణకిది మార్గం కాదు

## సంపాదకీయం

'వెనకటికెవడో కొండంత రాగం తీసి ఏదో పాట పాడాడట' అలా వుంది మన రాష్ట్రప్రభుత్వ నిర్వాకం. గత ఆరు నెలలుగా కొత్త మద్య విధానం ప్రకటిస్తామని ఊరించి ... ఊరించి ... చివరికి 'లాటరీ పాట' పాడింది. అధికారులను పక్క రాష్ట్రాలకు పంపి అధ్యయనం చేయించింది. ఆ నివేదికలను అమాత్యులచే పరిశీలింపచేసి చివరికి గతంలో చంద్రబాబు నాయుడు అనుసరించి విఫలమైన లాటరీ విధానాన్నే ఖరారు చేసేంది. ఈ తతంగం చూస్తే 'బాబు సీసాలో కిరణ్ సారా' లాగా కొత్త మద్యవిధానం ఉంది. ఇది మద్యనియంత్రణకు మార్గం కాదు.

మద్య వ్యాపారాన్ని ప్రైవేటు వ్యక్తులకు ఏ రూపంలో అప్పగించినా చివరికి వారు సిండికేట్లుగా మారి ప్రభుత్వ ఖజానాకు గండి కొడతారని, ప్రజల జేబుకి చిల్లు పెడతారని గత అనుభవం మనకు చెబుతుంది. మద్యాన్ని నియంత్రించాలంటే పక్క రాష్ట్రమైన తమిళనాడులో లాగా ప్రభుత్వమే రిటైల్ షాపులు నిర్వహించి ప్రస్తుతం ప్రభుత్వ ఆఫీసులు ఎంత అధ్వాన్నంగా నడుస్తున్నాయో అలా నడిచినప్పుడే మద్యనియంత్రణ సాధ్యం అవుతుంది. లాభాపేక్ష లేని ప్రభుత్వం మద్యాన్ని కట్టడి చేస్తుంది. మద్యం మీద ఆదాయాన్నే ప్రధాన ఆదాయ వనరుగా భావించే మన రాష్ట్ర ప్రభుత్వం విధానం ఏదయినా ప్రజల్ని దోపిడీ చేస్తుంది.

ప్రస్తుత మద్యవిధానంలో పదివేల లోపు జనాభా గల గ్రామాలలో వైన్ షాపు పెట్టాలంటే ముప్పైరెండున్నర లక్షల రూపాయలు చెల్లించాలి. అదే పదివేల నుండి యాభైవేల వరకూ జనాభా వుంటే మరో లక్షన్నర జమ చేస్తే సరిపోతుంది. అలా ఈ అంతరం జనాభాలో పెరిగి డబ్బుల్లో తక్కువైంది. దీంతో గ్రామాల్లో మద్యంమీద ప్రజలను దోపిడీ చేయడానికి ఎక్కువ అవకాశం ఉంది. ఇప్పటికే బెల్టుషాపుల రూపేణ కొనసాగే దోపిడీకి లైసెన్స్ ఇచ్చినట్లు అవుతుంది. అలాగే లాటరీలో లైసెన్స్ కేటాయించినా అంతకు నాలుగురెట్లకన్నా ఎక్కువ మద్యాన్ని అమ్మకూడదన్న నిబంధన కూడా ఆచరణీయం కాదు. అమ్మే సరుకు మీద ఆంక్షలు పెట్టినప్పుడు ఎమ్మార్పీ ధరలకే మద్యాన్ని అమ్మిస్తామన్న ప్రభుత్వ ఉత్తర్వు 'ఉత్తర ప్రగల్భమే' అవుతుంది. మద్యాన్ని ఒక నైతిక సమస్యగా చూడకూడదు. పేదల బతుకుల్లో చిచ్చుపెట్టి, వారిని ఆర్థిక, సామాజిక రంగాల్లో నిర్వీర్యం చేసే మహమ్మారిగా చూడాలి.

ఈ లాటరీ మద్యవిధానం ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదు. మద్యం వ్యాపారాన్ని ప్రభుత్వమే చేపట్టి పరిమితవేళల్లో, పరిమితంగా మద్యం దుకాణాలను నిర్వహించాలి. నాటుసారాని నియంత్రించే అధికారాన్ని పూర్తిగా పంచాయతీలకు అప్పజెప్పాలి. అక్కడ అక్రమాలు జరిగితే పంచాయతీ పాలక వర్గాలను రద్దుచేయడంతో పాటు, వారిపై క్రిమినల్ చర్యలు తీసుకునే అవకాశం ఉండాలి. అప్పుడే రాష్ట్రంలో మద్యనియంత్రణ సాధ్యమవుతుంది. ◆




# కార్టూన్ కార్నర్

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.


**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**

8-2-674బి/2/9, ప్లాట్ నం : 93
హ్యాపీ వ్యాలి, రోడ్ నం.13ఎ,
బంజారాహిల్స్, హైదరాబాద్ - 500 034

**ఫోన్ నంబర్లు :**
**040- 23311817, 23311819,**
**23311820, 23312829**
**ఫ్యాక్స్ : 040-23310612**

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com


## చందా వివరాలు

జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం: **040-23311817**

*విడి ప్రతి : రు. 10 ,*
*ఏడాది చందా : రు. 200*
*మూడేళ్ళ చందా : రు. 500*

చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ *నం: 62007167836* ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

- ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

# రాష్ట్రంలో రాజకీయ శక్తుల పునరేకీకరణ జరగాలి : జేపీ

మినీ సాధారణ ఎన్నికలుగా జరిగిన తాజా ఉప ఎన్నికలలో అధికార కాంగ్రెస్ పార్టీ, ప్రధాన ప్రతిపక్షం తెలుగుదేశం పార్టీ ఏకకాలంలో ఘోరంగా విఫలమైన పరిస్థితులలో రాష్ట్రంలో రాజకీయ శక్తుల పునరేకీకరణ జరగాలని లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ పిలుపునిచ్చారు.

రాష్ట్రంలో 18 అసెంబ్లీ స్థానాలకు, 1 లోక్‌సభ స్థానానికి జరిగిన ఉపఎన్నికల ఫలితాలపై జయప్రకాష్ నారాయణ్ జూన్ 15న ఇక్కడ పార్టీ ప్రధాన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ...**రాష్ట్రంలో బలమైన, నీతివంతమైన రాజకీయం కోసం వామపక్ష పార్టీలతో మన్ముందు మరింత విస్తృతస్థాయిలో కలిసిపనిచేస్తామని తెలిపారు.** అవినీతి రాజకీయానికి పునాది వేసిన కాంగ్రెస్, డబ్బు రాజకీయానికి బాటలు వేసిన తెలుగుదేశం పార్టీ అందుకు ఈవేళ భారీ మూల్యం చెల్లించాయని, ఆ రెండు పార్టీల నుంచి ఆవిర్భవించిన వైకాపా గతించిపోతున్న పాతరాజకీయానికి పరాకాష్ఠలా తాజా ఉప ఎన్నికలలో విజయం సాధించిందని అన్నారు.

కాంగ్రెస్, టీడీపీ, వైకాపాలు ఎటువంటి ఎజెండా లేకుండా కేవలం ఓట్ల కొనుగోలుకు డబ్బును విచ్చలవిడిగా వెదజల్లాయని, ఓట్ల కొనుగోలుకు డబ్బుఖర్చులో దేశంలోనే పేరుమోసిన ఆంధ్రప్రదేశ్ ప్రమాణాల్ని కూడా ఈ ఉప ఎన్నికలు దాటేశాయని జేపీ అన్నారు. వైఎస్ జగన్మోహన రెడ్డి అవినీతిపైనే కాంగ్రెస్, తెలుగుదేశం ప్రచారం చేయగా, వైఎస్సార్ కుటుంబానికి అన్యాయం జరిగిందనే వాదనతోనే వైకాపా ప్రచారం చేసిందన్నారు. మూడు పార్టీలూ అవినీతిపార్టీలే అని నిర్ధారించుకున్న ప్రజలు కాంగ్రెస్, తెలుగుదేశం పట్ల తీవ్రవ్యతిరేకతతో చివరకు వైకాపావైపు మొగ్గుచూపారన్నారు. అటు అధికార పార్టీ వ్యతిరేకతను, ఇటు ప్రధాన ప్రతిపక్ష ప్రాచుర్యాన్ని వైకాపా చాలా చాతుర్యంతో వినియోగించుకుని భారీ మెజారిటీతో నెగ్గిందన్నారు.

కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలు అధికారాన్ని కేంద్రీకరించి, ఎమ్మెల్యేలను మకుటం లేని చక్రవర్తుల్లా మార్చి, ప్రజల్ని శాశ్వత పేదలుగా కొనసాగిస్తూ తాయిలాల్ని వెదజల్లుతూ వచ్చాయని జేపీ అన్నారు. సైద్ధాంతిక బలం, నాయకత్వం పట్ల విశ్వాసం, నిబద్ధత లేకపోవటంతో పాటు కనీసం ఎన్నికలలో గెలిచే శక్తిని కూడా కోల్పోవటం వల్ల కాంగ్రెస్, తెలుగుదేశం వంటి సాంప్రదాయ రాజకీయ పార్టీలకు మనుగడ ఉండదని, రేపు వైఎస్ జగన్మోహన రెడ్డి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలనుకుంటే ఆ రెండు పార్టీల నుంచి పెద్దసంఖ్యలో వలసలు ఉంటాయని అన్నారు. అదే మూసలో ఆవిర్భవించిన వైకాపా కూడా మన్ముందు గెలిచే పరిస్థితి లేకపోతే ఇదే తరహా సంక్షోభాన్ని ఎదుర్కొంటుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో నెలకొన్న ఈ సంక్షోభం ఒకరకంగా భారతదేశ రాజకీయాలలో సంక్షోభానికి అద్దంపడుతోందని జేపీ అన్నారు. ఈ నేపథ్యంలోనే ఒక దీర్ఘకాలిక ఎజెండాతో, భవిష్యత్తు కొత్త రాజకీయానికి పునాది వేసేందుకు సీపీఎంతో కలిసి ఈ ఉప ఎన్నికలలో లోక్‌సత్తా పోటీచేసిందని, ఒక ప్రత్యామ్నాయ ఎజెండాను ప్రజల ముందు ఉంచిందని జేపీ అన్నారు. ఖచ్చితంగా ఈ ఎన్నికలలో తాము కొన్ని మౌలికాంశాలను లేవనెత్తామని, ప్రజలలో కొంతమందిని చేరగలిగామని, వారిలో కొంతమందిని ప్రభావితం చేయగలిగామని, అయితే తమ గొంతు సరిపోలేదని జేపీ అన్నారు.

**కాలం చెల్లిన రాజకీయం స్థానంలో బలమైన ప్రత్యామ్నాయ కొత్తరాజకీయాన్ని తెచ్చేందుకు వామపక్షాలతో కలిసి పనిచేస్తామని, త్వరలోనే ఈ దిశగా కార్యాచరణను ఖరారు చేస్తామని జేపీ తెలిపారు.**

“రాష్ట్రంలో పేదరికాన్ని తొలగించకుండా కేవలం పేదలను సంతృప్తి పరిచి ఓట్లు కొల్లగొట్టే సాంప్రదాయ రాజకీయం జరుగుతుండటం వల్ల ప్రజలలో అశాంతి పెరుగుతోంది. త్వరలో ఎన్నికలు వచ్చి ఆ మూడు సాంప్రదాయ పార్టీలలో ఏదైనా ఒకే పార్టీ పూర్తి మెజారిటీని సాధించినా కూడా రాష్ట్రంలో మూడేళ్ల నుంచి కొనసాగుతున్న సంక్షోభం, అనిశ్చితి ఏదోకరూపంలో అలాగే కొనసాగుతాయి. ఇంకా పెరుగుతాయి. అందుకే ప్రస్తుత

రాజకీయం స్థానంలో నాణ్యమైన విద్యను అందించి, పేదరికాన్ని తొలగించి, గ్రామస్థాయి వరకూ అందరికీ ఆదాయాన్ని పెంచి తలెత్తుకుని జీవితాల్ని అందించే కొత్త రాజకీయం తెచ్చేందుకు, ఎన్నికల వ్యవస్థలో మౌలికమార్పుల్ని తెచ్చి దామాషా ఎన్నికల వ్యవస్థను తెచ్చేందుకు లోక్‌సత్తా పార్టీ వామపక్షాలతో కలిసి కృషి చేస్తుంది. ఇందులో భాగంగా అవినీతిని అంతం చేయటం, అందరికీ నాణ్యమైన విద్య, ఆరోగ్యం, ఉపాధి అవకాశాలను అందించటం, అధికారాన్ని వికేంద్రీకరించటం, వ్యవసాయాన్ని లాభసాటి చేయటం, మద్యాన్ని కఠినంగా నియంత్రించటం అంశాల మీద ప్రధానంగా దృష్టి సారిస్తాం. **ధనరాజకీయంలో కూరుకుపోయి ఆవేదన చెందుతూ కొత్తరాజకీయం కోరుకుంటున్నవారంతా రాజకీయ పునరేకీకరణలో భాగంగా ఈ కృషిలో కలిసిరావాలి"** అని జేపీ విజ్ఞప్తి చేశారు.

"ఎన్నికలలో డబ్బు ఖర్చు చేయనివారు ఓడిపోవటం ఖాయం. అయితే ఇతరులకంటే ఎక్కువ డబ్బు వెదజల్లినంత మాత్రాన వారు గెలుస్తారనుకోవాల్సిన పన్లేదు. డబ్బు ఖర్చు చేయటం ఎన్నికలలో ఒక ప్రాథమిక అర్హతగా మారిపోయింది. అసెంబ్లీ నియోజకవర్గానికి రూ. 20కోట్లు ఎంట్రీఫీజుగా అయిపోయింది" అని ఒక ప్రశ్నకు సమాధానంగా జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ◆

## కొత్త మద్యం పాలసీ 2012-13
## లాటరీ ద్వారా కేటాయిస్తారు
## మద్యం దుకాణానికి ఎంత ఫీజు?

| జనాభా | లైసెన్సు రుసుం (ఏడాదికి రూ॥లక్షల్లో) |
|---|---|
| **10 వేలలోపు** | **32.50** |
| **10 నుంచి 50 వేల వరకు** | **34** |
| **50 వేల నుంచి 3 లక్షల వరకు** | **42** |
| **3 లక్షల నుంచి 5 లక్షల వరకు** | **46** |
| **5 లక్షల నుంచి 20 లక్షల వరకు** | **64** |
| **20 లక్షలపైన** | **1.04 కోట్లు** |

- గత ఏడాది మద్యం దుకాణాల లైసెన్సు ఫీజు ద్వారా సమకూరిన ఆదాయం : రూ॥3500 కోట్లు
- ఈ ఏడాది కొత్త విధానం ద్వారా రానున్న లైసెన్సు ఫీజు : రూ॥2500 కోట్లు.

## రాష్ట్రపతి ఎంపిక... పార్టీల పరిస్థితి

| పార్టీ | ఎమ్మెల్యేలు | ఎంపీలు | ఓటు విలువ |
|---|---|---|---|
| **యూపీఏ** | | | |
| కాంగ్రెస్ | 1,177 | 277 | 3,30,485 |
| తృణమూల్ | 199 | 28 | 48,049 |
| డీఎంకే | 25 | 25 | 21,780 |
| ఎన్‌సీపీ | 94 | 16 | 23,850 |
| ఆర్జేడీ | 27 | 6 | 8,934 |
| ఎన్‌సీ | 28 | 5 | 5,556 |
| ముస్లింలీగ్ | 20 | 2 | 4,456 |
| జేవీఎం | 11 | 2 | 3,352 |
| ఏఐఎంఎం | 7 | 1 | 1,744 |
| బీపీఎఫ్ | 12 | 2 | 2,808 |
| కేరళ కాంగ్రెస్ | 9 | 1 | 2,076 |
| ఆరెల్డీ | 9 | 6 | 6,220 |
| ఎల్‌జేపీ | 1 | 1 | 881 |
| **మొత్తం** | **1,619** | **372** | **4,60,191** |
| **యూపీయేతర, ఎన్డీయేతర** | | | |
| ఎస్పీ | 230 | 30 | 68,812 |
| బీఎస్పీ | 91 | 36 | 43,349 |
| ఏఐడీఎంకే | 158 | 14 | 36,920 |
| లెఫ్ట్ పార్టీలు (4) | 196 | 39 | 51,682 |
| బీజేడీ | 103 | 20 | 30,215 |
| టీడీపీ | 86 | 11 | 20,516 |
| జేడీ(ఎస్) | 30 | 3 | 6,138 |
| పీడీపీ | 22 | 0 | 1,584 |
| టీఆర్ఎస్ | 12 | 2 | 3,192 |
| **మొత్తం** | **928** | **155** | **2,62,408** |
| **ఎన్డీయే** | | | |
| బీజేపీ | 825 | 163 | 2,23,885 |
| జేడీ(యు) | 121 | 30 | 42,153 |
| ఎస్ఏడీ | 57 | 7 | 11,564 |
| శివసేన | 45 | 15 | 18,495 |
| జేఎంఎం | 18 | 2 | 4,584 |
| ఏజీపీ | 10 | 3 | 3,284 |
| హెచ్‌జేసీ | 1 | 1 | 820 |
| **మొత్తం** | **1,077** | **221** | **3,04,785** |

**ఏ ఒక్క కూటమికీ రాష్ట్రపతి అభ్యర్థిని సొంతంగా గెలిపించుకొనేందుకు తగిన మెజార్టీ లేదు. గెలుపునకు కనీసం 5,49,442 ఓట్లు అవసరం**

# రాష్ట్రపతి ఎన్నికనూ మసిబారుస్తున్న దిగజారుడు రాజకీయ వ్యవస్థ

భారతదేశంలో అత్యున్నత పీఠమైన రాష్ట్రపతి ఎన్నిక ఏకగ్రీవంగా, రాజకీయాలకతీతంగా జరగాలని జాతిహితం కోరుకునేవారందరూ ఆశిస్తారు. ఏకగ్రీవంగా కాకపోయినా, కనీసం కుళ్లు రాజకీయాలకు ఆస్కారం లేకుండా రాష్ట్రపతి ఎన్నిక జరగటాన్ని ఓ సంప్రదాయంగా కొనసాగించటానికైనా ఇటీవలికాలం వరకూ కొంతప్రయత్నం జరిగేది. కానీ జులై 19, 2012న జరగనున్న రాష్ట్రపతి ఎన్నికలు జాతిహితంతో, విలువలతో ఎటువంటి సంబంధం లేకుండా రాజకీయ రొచ్చులోకి జారిపోతున్నట్టు జరుగుతున్న పరిణామాలను బట్టి అర్థమవుతోంది.

రాష్ట్రపతి పదవి నుంచి వైదొలగుతున్న ప్రతిభా పాటిల్ ఆ అత్యున్నత పదవికి న్యాయం చేయటానికి వీసమెత్తు ప్రయత్నం కూడా చేయలేదనే సహేతుక విమర్శ అటుతిరిగీ ఇటుతిరిగీ చివరకు ఆ రాజ్యాంగపీఠాన్ని, తద్వారా యావత్ భారతజాతిని అవమానించే స్థాయికి దిగజారింది. రాష్ట్రపతి పదవికి అభ్యర్థులకుండే లక్షణాల పేరుతో వ్యవస్థను అపహాస్యం చేస్తూ మీడియాలో ఇష్టమొచ్చినట్టు వచ్చిన కార్టూన్లు పరిష్కారంలోకాకుండా సమస్యలో భాగంగా మారాయి.

ఇక ఈ ఎన్నికలో ప్రధాన జాతీయపార్టీలైన కాంగ్రెస్, బీజేపీల వైఫల్యం కొట్టచ్చినట్టు కనిపిస్తోంది. అవినీతిలో కూరుకుపోయి అచేతనంగా మారిపోయిన యూపీయే-2 ప్రభుత్వం రాష్ట్రపతి ఎంపికలో స్పష్టమైన వైఖరిని తీసుకుని, అందరినీ ఒప్పించే శక్తిని కోల్పోయింది. అదేరీతిలో బీజేపీ కూడా కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతిస్తే 2014లో జరగనున్న ఎన్నికలలో తమకు ఇబ్బందేమో అని ఆందోళన చెందుతోందితప్ప, సొంతంగా అభ్యర్థి ఎంపిక చేసి ఆమోదయోగ్యత సంపాదిద్దామనే యోచనలోనే లేదు. కాంగ్రెస్ ఉపరాష్ట్రపతి హమీద్ అన్సారీ పేరును ప్రతిపాదిస్తోందనే వార్తలకు స్పందిస్తూ, ఆయనకు అంతస్థాయి లేదని లోక్‌సభలో బీజేపీ నేత సుష్మాస్వరాజ్ చేసిన వ్యాఖ్యలు ఆ పార్టీకే ఇరకాటంగా మారాయి. ఆ తర్వాత నాలిక్కరుచుకుని, బీజేడీని, ఏఐడీఎంకేని తిరిగి ఎన్డీయే కూటమిలోకి ఆహ్వానించుకునేందుకు వీలుగా తాము కూడా సంగ్మాకే మద్దతు ప్రకటించాలని బీజేపీ తొలుత అనుకున్నా, ఏ పరిస్థితులలోనైనా సంగ్మా ఉపసంహరించుకుంటే తాము అభాసుపాలవుతామని ఆ పార్టీ సంకోచించింది. మరోపక్క, బీజేపీ గనక ప్రణబ్‌కు మద్దతిస్తే తాను బరిలోకి దిగుతానని బీజేపీ ఎంపీ రాంజెఠ్మలానీ ప్రకటించటం ఆ పార్టీకి కొంత ఇబ్బందికరంగా మారింది. ఈ పరిస్థితులలో మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాంను అభ్యర్థిగా ఒప్పించాలని ప్రయత్నించింది. కలాం మాత్రం పోటీచేయనని ప్రకటించారు. ఏకగ్రీవమైతేనే రాష్ట్రపతి పదవి చేపట్టాలని ఆయన భావించినట్టు సమాచారం. ఈ ఎన్నికను ఇంత రాజకీయ కాలుష్యం చుట్టుముట్టబట్టే ఆయన "ప్రస్తుత రాజకీయ పరిస్థితులలో పోటీచేయలేను" అని స్పష్టంచేశారు.

యూపీయే కూటమికి నేతృత్వం వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ తమ అభ్యర్థిగా ఎట్టకేలకు ప్రణబ్ ముఖర్జీ పేరును ప్రకటించటం వెనక కూడా అనేక రాజకీయ ఎత్తుగడలు, కుతంత్రాలు నడిచినట్టు బలమైన అనుమానాలే వ్యక్తమవుతున్నాయి. దాదాపు 50 ఏళ్ల సుదీర్ఘ రాజకీయానుభవం కలిగి, కాంగ్రెస్ రాజకీయ సంస్కృతిని నరనరానా నింపుకున్న ప్రణబ్ ముఖర్జీయే ఈసారి రాష్ట్రపతి ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి అనే వార్తలు ఎంతోకాలంగా వస్తున్నాయి. పరోక్షంగా ప్రణబ్ దాదా కూడా తనను తాను రాష్ట్రపతిగా పేర్కొంటూ, అవకాశం దొరికనప్పుడల్లా ఆ భావన కలిగే వ్యాఖ్యలు చేస్తూ వచ్చారు. ఇందిరాగాంధీ హత్య జరిగిన సమయంలో తాత్కాలిక ప్రధానిగా సంప్రదాయాన్ననుసరించి తనను కాకుండా రాజీవ్‌గాంధీని అప్పటి రాష్ట్రపతి జైల్‌సింగ్ ఆహ్వానించటం, తదనంతర అవమానకర పరిణామాల నేపథ్యంలో ప్రణబ్ కొంతకాలం కాంగ్రెస్‌కు దూరమై, రాష్ట్రీయ సమాజ్‌వాదీ కాంగ్రెస్‌ను ఏర్పాటుచేశారు. మళ్లీ బోఫోర్సు కుంభకోణం ఆరోపణల నేపథ్యంలో కాంగ్రెస్‌ను బలోపేతం చేసేందుకు రాజీవ్‌గాంధీ తిరిగి ప్రణబ్, ఆర్‌కే ధావన్ తదితరులను పార్టీలోకి ఆహ్వానించారు. అయితే ఆనాటి పొరపొచ్చాలు ఇంకా గాంధీ కుటుంబం-ప్రణబ్‌ల మధ్య తొలగిపోలేదు. అందుకే 2004లో ప్రధానమంత్రిగా తన అభ్యర్థిత్వాన్ని వదులుకోవాల్సిన

పరిస్థితులలో కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీమతి సోనియాగాంధీ ప్రణబ్‌ను కాకుండా మన్మోహన్‌సింగ్‌ను ఎంపిక చేసినట్టు చెబుతారు. కీలక పదవులలో కొనసాగుతున్నా ప్రణబ్ పట్ల సోనియాకు ఇంకా విశ్వాసం కలగలేదని, విధిలేని పరిస్థితులలోనే ఆయనను రాష్ట్రపతి అభ్యర్థిగా ప్రకటించారని అంటున్నారు.

అభ్యర్థి ఎంపికపై మమతా బెనర్జీతో సమావేశమైన సోనియా తన తొలి ప్రాధాన్యం ప్రణబ్ అని, రెండో ప్రాధాన్యం హమీద్ అన్సారీ అని చెప్పినట్టు మీడియా ముందు మమతా బెనర్జీ కుండబద్దలు కొట్టటం కాంగ్రెస్‌కు మింగుడు పడలేదు. ప్రణబ్ బెంగాలీ, అన్సారీ ముస్లిం మైనారిటీ కాబట్టి మమత ఇంక మాట్లాడే అవకాశముండదు అని భావించిన సోనియాకు మమత మీడియా సమావేశం ఇరకాటాన్ని సృష్టించింది. మన్మోహన్ సింగ్, అబ్దుల్ కలాం, సోమనాథ్ ఛటర్జీలలో ఎవరో ఒకరైతే తమకు ఆమోదయోగ్యమని సమాజ్‌వాదీ పార్టీ నేత ములాయం సింగ్ యాదవ్‌తో కలిసి మమత బాహాటంగా ప్రకటించారు. బెంగాలీ, ముస్లిం మైనారిటీతోపాటు సాక్షాత్తూ ప్రధానినే బరిలోకిలాగి సోనియా వ్యూహానికి వారు చెక్ పెట్టాలని ప్రయత్నించారు. ఈ పరిణామాలతోపాటు తనను తాను రాష్ట్రపతి అభ్యర్థిగా ప్రణబ్ వ్యూహాత్మకంగా ముందునుంచీ చేసుకుంటున్న ప్రచారం నేపథ్యంలోనే సోనియాగాంధీ విధిలేని పరిస్థితులలో ప్రణబ్‌ను తమ అభ్యర్థిగా ప్రకటించారని సమాచారం. ఇక్కడ మరో విచిత్రమైన పరిణామం కూడా ఉంది. మమతతో కలిసి మన్మోహన్, కలాం, సోమనాథ్‌ల పేర్లను ప్రకటించిన ములాయం రాత్రికి రాత్రి మాట మార్చి తిరిగి కాంగ్రెస్ ప్రకటించిన ప్రణబ్ అభ్యర్థిత్వానికి మద్దతు ప్రకటించారు. తృణమూల్ కాంగ్రెస్‌ను తప్పించి యూపీఏలోకి తాను ప్రవేశించాలని సమాజ్‌వాదీ పార్టీ చేస్తున్న ప్రయత్నాలలో భాగంగా ఇది జరిగినట్టు కనిపిస్తోంది. తన మీద ఉన్న అవినీతి, అక్రమాల ఆరోపణల నేపథ్యంలోనే ములాయం కాంగ్రెస్ పార్టీ చేతిలో కీలుబొమ్మగా మారి కప్పగంతులు వేస్తున్నారని కథనాలు వెలువడుతున్నాయి. అయితే కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీల మధ్య ఇంకేదైనా లోపాయికారీ అవగాహన ఉందేమో అని వస్తున్న సందేహాలకు కాలమే సమాధానం చెప్పాలి. ఎస్పీతో పాటు బీఎస్పీ కూడా ప్రణబ్‌కే మద్దతు ప్రకటించింది. వామపక్షాలతో సహా ఇతర పార్టీలన్నిటి మద్దతు సంపాదించేందుకు ప్రణబ్ గట్టిగా ప్రయత్నిస్తున్నారు. ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ కూడా ఫోన్ ద్వారా అభ్యర్థనలు చేస్తున్నారు.

ఇక గిరిజన ప్రతినిధిగా తాను పోటీచేస్తానని పీఏ సంగ్మా ప్రకటనకు ఒడిశా ముఖ్యమంత్రి, బీజేడీ నేత నవీన్ పట్నాయక్ పూర్తి మద్దతు పలికారు. ఒడిశాలో గిరిజనులు ఎక్కువగా ఉండటం వల్ల వ్యూహాత్మకంగానే ఆయన సంగ్మాకు అండగా నిలిచారు. తమిళనాడు ముఖ్యమంత్రి, ఏఐడీఎంకే నేత జయలలిత కూడా సంగ్మాకుఅభ్యర్థిత్వానికి మద్దతు పలికారు. ఇక టీడీపీ, టీఆర్ఎస్, వైకాపా వంటి పార్టీలు ఎటు నిర్ణయం తీసుకుంటాయో వేచిచూడాలి. జాతీయస్థాయిలో యూపీఏకు మద్దతిస్తానని వైకాపా నేత వైఎస్ జగన్మోహన రెడ్డి గతంలో ఓ జాతీయ ఛానల్ ఇంటర్వ్యూలో ప్రకటించి వున్నారు.

ఇప్పటివరకూ ఉన్న అంచనాల ప్రకారం ప్రణబ్ ముఖర్జీకే రాష్ట్రపతిగా ఎన్నికయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఎమర్జెన్సీ కాలంలో అనేక అకృత్యాలకు బాధ్యత వహించాల్సిన ఇందిరాగాంధీ ఆంతరంగిక బృందంలో ప్రణబ్ ముఖర్జీ కూడా ఒకరు. అలాగే యూపీయే ప్రభుత్వంలో కీలకపాత్ర పోషించిన మంత్రిగా అధికార కూటమి ఎదుర్కొంటున్న కుంభకోణాల ఆరోపణలకు ప్రణబ్ దాదా కూడా ఏదోకరకంగా జవాబుదారీయే అవుతారు. కాబట్టి ఆయన రాష్ట్రపతి అభ్యర్థిగా పనికిరారు అనే ఆరోపణలు కూడా వస్తున్నాయి. అయితే రాజకీయ వ్యవస్థను, ఎన్నికల వ్యవస్థను ప్రక్షాళన చేయకుండా కేవలం పైస్థాయిలో వున్న వ్యక్తుల మీద నిరూపించలేని ఆరోపణలు చేస్తుండటం వల్ల ప్రయోజనం ఉండదు కాబట్టి ప్రణబ్ కొన్ని ఒడిదుడుకులున్నా ఆ పీఠాన్ని అధిరోహించవచ్చు. అపార అనుభవం, 70వ పడిలోవున్నా కూడా ఉదయం ఆరుగంటలకు మొదలుపెట్టి రాత్రి ఒంటిగంట వరకూ శ్రమించే ఆరోగ్యాన్ని, ఉత్సాహాన్ని కలిగివున్నందున ప్రణబ్ ఆ పదవిలో ఎంతోకొంత క్రియాశీలకంగా వ్యవహరించగలరనే భావిస్తున్నారు. అంటే వ్యవస్థీకృత మార్పులు తెస్తారని కాదు సుమా!... అలాంటి మార్పులు తెచ్చే అవకాశమూ అక్కడ లేదు, అలాంటి సంకల్పాన్ని, ప్రయత్నాన్ని ప్రణబ్ తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఎన్నడూ ప్రదర్శించిన దాఖలాలు కూడా లేవు.

**కొసమెరుపు: 'మీరు రాజకీయ పార్టీ పెట్టకుండా ఉంటే అబ్దుల్ కలాం లాగా భారత రాష్ట్రపతి అయ్యుండేవారు గదా' అని లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్‌ని లోక్‌పాల్ కోసం రథయాత్ర చేస్తున్న సందర్భంగా కొందరు విద్యార్థులు ప్రశ్నించారు. 'రాష్ట్రపతిగా పదవీవిరమణ చేశాక అబ్దుల్ కలాం ఏం చేస్తున్నారో ఇప్పుడు నేను అదే చేస్తున్నాను' అని జేపీ వారికి సమాధానం చెప్పారు.**

**-21వ శతాబ్దపు భారతీయుడు**

# జగన్ విజయ రహస్యం ఏమిటి?

- డి.వి.వి.యస్. వర్మ

మినీ సాధారణ ఎన్నికలుగా జరిగిన ఉప ఎన్నికలలో అధికారంలో వున్న కాంగ్రెస్ పార్టీ, ప్రధాన ప్రతిపక్షంగా వున్న తెలుగుదేశం పార్టీలు పరాజయాన్ని మూటగట్టుకున్నాయి. పట్టుమని రెండేళ్లు కూడా నిండని జగన్‌పార్టీ పెద్ద మెజారిటీలతో విజయాన్ని చేజిక్కించుకుంది. గతంలో జగన్, ఆయన తల్లి విజయమ్మలు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి భారీ మెజారిటీలతో గెలుపొందినప్పుడు వారు ప్రత్యక్షంగా రాజశేఖరరెడ్డి వారసులు కావడం. వారి స్వంత నియోజక వర్గాలలో గెలుపు సాధించడం సర్వసాధారణంగా భావించడం జరిగింది. ఆ తర్వాత కోవూరులో జరిగిన ఉప ఎన్నికలో విజయం ఒక ప్రత్యేక ఫలితంగా ఊహించడం జరిగింది. ఇప్పుడు పరిస్థితి అది కాదు, ఇవి ఒక పార్లమెంటు స్థానానికి, 18 అసెంబ్లీ స్థానాలకు, 12 జిల్లాలకు విస్తరించి జరిగిన ఎన్నికలు. జగన్ పార్టీకోసం రాజీనామా చేసిన 17 మంది శాసన సభ్యులతో 14 మంది, ఒక పార్లమెంటు స్థానాన్ని పెద్ద మెజారిటీలతో గెలిచారు. అంతకు మించి చిరంజీవి రాజీనామా వల్ల తిరుపతి స్థానానికి జరిగిన ఎన్నికలలో కూడా ఆ పార్టీ విజయాన్ని సాధించింది. అలాగే పరకాలలో తెరాసతో పోటీపడి కొద్ది తేడాతో పరాజయం పాలైంది. రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా వుండి 2009 ఎన్నికలలో ఆయన సాధించిన ఓట్లు 36శాతం కాగా గెలిచిన స్థానాలు 53 శాతం. అయితే ఇప్పుడు జగన్ 46.85 శాతం ఓట్లనీ, 84 శాతం సీట్లనీ గెల్చుకున్నారు. అసలు కంటే వడ్డీ ముద్దు అన్నట్లు రాజశేఖర రెడ్డి కంటే ఆయన నీడకి ప్రభావం ఎక్కువ ఉన్నట్లు అయింది. అలాగే తెలుగుదేశం పార్టీకి ఈ 18స్థానాలలో 2009లో 30.72 శాతం ఓట్లురాగా, ఇప్పుడు కేవలం 24.23 శాతం మాత్రమే వచ్చాయి. కాంగ్రెస్‌కు 2009లో ఈ స్థానాలలో 42.67 రాగా ఇప్పుడు 21.00 శాతం ఓట్లు వచ్చాయి. మొత్తం మీద ఈ రెండు పార్టీలకు వచ్చిన ఓట్ల కంటే జగన్ పార్టీకి అధికంగా ఓట్లు రావడం ఒక విపరీత పరిణామం... ఇప్పుడు రాష్ట్రంలో జగన్ పార్టీ ఒక ప్రధాన రాజకీయ శక్తిగా ముందుకొచ్చింది. దీనికి గల కారణాలను లోతుగా విశ్లేషించుకోవలసిన అవసరం వుంది.

ప్రస్తుతం ఓటమిపాలైన ప్రధాన రాజకీయ పక్షాల, అంతర్మధనాలు, పత్రికలలో వస్తున్న వార్తా విశ్లేషణలు అలాంటి

**నాడు... నేడు... ఎవరికెంతో !**

ఉప ఎన్నికలు జరిగిన 18 అసెంబ్లీ స్థానాల్లో ప్రధాన పార్టీలు 2009లోనూ తాజాగా సాధించిన ఓట్ల శాతం వివరాలు

| నియోజకవర్గం | 2009 | | | 2012 | | |
|---|---|---|---|---|---|---|
| | కాంగ్రెస్ | తెదేపా | ప్రరాపా | కాంగ్రెస్ | తెదేపా | వైకాపా |
| నర్సన్నపేట | 44.2 | 31.3 | 18.5 | 29.6 | 23.2 | 39 |
| పాయకరావుపేట | 32.1 | 31.7 | 31.2 | 19.7 | 33.5 | 41.9 |
| రామచంద్రపురం | 39.9 | 16.4 | 37.0 | 49.9 | 4.0 | 42.2 |
| నరసాపురం | 50.5 | 9.3 | 35.6 | 47.0 | 7.0 | 43.4 |
| పోలవరం | 34.8 | 30.9 | 25.2 | 10.7 | 30.0 | 54.0 |
| ప్రత్తిపాడు | 39.3 | 38.1 | 20.1 | 8.9 | 39.4 | 48.8 |
| మాచర్ల | 44.0 | 37.6 | 10.8 | 11.0 | 37.6 | 46.7 |
| ఒంగోలు | 42.9 | 28.3 | 21.5 | 14.5 | 31.5 | 48.8 |
| ఉదయగిరి | 46.9 | 37.8 | 10.4 | 21.5 | 27.8 | 46.8 |
| తిరుపతి | 31.6 | 16.7 | 44.1 | 30.2 | 22.3 | 43.3 |
| కోడూరు | 44.0 | 33.5 | 18.8 | 27.9 | 14.2 | 53.9 |
| రాజంపేట | 46.7 | 34.7 | 15.5 | 26.4 | 14.6 | 52.3 |
| రాయచోటి | 50.0 | 39.9 | 5.4 | 15.9 | 21.4 | 57.1 |
| రాయదుర్గం | 48.9 | 39.9 | 6.4 | 20.6 | 27.3 | 46.3 |
| అనంతపురం | 39.0 | 27.6 | 26.6 | 7.6 | 33.0 | 52.9 |
| ఆళ్లగడ్డ | 38.7 | 15.4 | 40.0 | 30.8 | 12.1 | 52.7 |
| ఎమ్మిగనూరు | 41.2 | 40.0 | 12.9 | 22.1 | 28.9 | 42.1 |

| | కాంగ్రెస్ | తెదేపా | తెరాస | ప్రరాపా | కాంగ్రెస్ | తెదేపా | తెరాస | వైకాపా |
|---|---|---|---|---|---|---|---|---|
| పరకాల | 47.0 | ..... | 38.1 | 8.1 | 3.0 | 19.6 | 33.0 | 32.0 |

ప్రయత్నం చేస్తున్నట్లు కనిపించడం లేదు. రాజకీయ పార్టీలు ఆత్మ సమర్ధనకు తగిన వాదనలు ముందుకు తెస్తున్నాయి. వాటినే పత్రికా విశ్లేషకులు అటూ ఇటూ తిప్పి చెబుతున్నారు. ఈ విశ్లేషణల వల్ల "జగన్మాయ" నిజస్వరూపం బైటకు వచ్చే అవకాశాలు కనిపించడం లేదు.

ఈ ఉప ఎన్నికలలో జగన్ పార్టీకి అత్యధిక సీట్లు వస్తాయని అందరూ ఊహించినదే, అయితే దీనికి కారణాలను పట్టుకోవడంలో అందరూ పొద చుట్టూ తిరుగుతునట్లు వ్యవహరిస్తున్నారు. ఈ తీర్పును కేవలం సానుభూతి తీర్పుగానే భావిస్తున్నారు. జగన్‌ను ఎన్నికల సమయంలో అరెస్టు చెయ్యడం వల్ల సానుభూతి వెల్లువెత్తిందని, అందుకు సి.బి.ఐ బాధ్యత వహించాలని కూడా కొందరు ప్రకటిస్తున్నారు. జగన్ అవినీతిని ప్రజలకు అర్థమయ్యే రీతిలో ఎండగట్ట లేకపోవడం వల్లే ఇలా జరిగిందని, ఢిల్లీ నుండి వచ్చిన కాంగ్రెసు అధిష్టానం నేతలు ప్రకటనలు కొంప ముంచాయని, అంతిమంగా విజయమ్మ, షర్మిలల ప్రచారంతో ప్రజల సానుభూతి ఓటుగా మారిందన్నది స్థూలంగా ఈ విశ్లేషణల సారాంశంగా వుంది.

దీనికితోడు కొన్ని చోట్ల ధన ప్రవాహంతో గెలుపు సాధించారన్న ప్రకటనలు వెలువడ్డాయి. ధన ప్రవాహంలో దాదాపు అన్ని పార్టీలు పోటీ పడ్డాయి డబ్బు, మద్యం, ఇతర వస్తువుల పంపిణీ ప్రధాన పార్టీలకు తప్పనిసరి అంశం అయినా కేవలం డబ్బు వల్లే గెలుపు సాధ్యం కావడం లేదనేది గతంలోనూ ఇప్పుడూ రుజువైంది. అలాగే అవినీతి మీద ప్రచారం కూడా ప్రజల్ని ఆకట్టుకోకపోగా తినంది ఎవరు? అనే ప్రశ్న ఎదురు వస్తున్నట్లు కూడా వార్తలొచ్చాయి. ఎందుకంటే అందరూ అదే తానులో ముక్కలు కావడంతో ఇలాంటి స్థితి వచ్చినట్టు కనిపిస్తున్నది. అందువల్ల జగన్ గెలుపులో సానుభూతి ఒక అంశం మాత్రమే ఎందుకంటే కాంగ్రెస్ పార్టీ, ప్రజారాజ్యంపార్టీ, తెలుగుదేశం పార్టీ ఓట్లను జగన్ పార్టీ కొల్లగొట్టింది. అంటే సానుభూతికి మించిన రాజకీయ కారణాలు లేకుండా ఇది సాధ్యం కాదు. ఇంత పెద్ద ఎత్తున ప్రజలు జగన్ వెంట పడడానికి కారణాలను మరింతలోతుగా పరిశీలించుకోవాలి.

## రాష్ట్రంలో విచిత్ర సంక్షోభం

జగన్ గెలుపు రహస్యాన్ని ఛేదించడానికి, విశ్లేషించడానికి రాష్ట్రంలో నెలకొన్న విచిత్రమైన రాజకీయ సంక్షోభాన్ని తరచి

| నియోజకవర్గాలు | 2012 | 2009 | తేడా(+/-) |
|---|---|---|---|
| నెల్లూరు లోక్‌సభ | 71.68 | 69 | +2.68 |
| అనంతపురం అర్బన్ | 65.9 | 50 | +15.90 |
| ఒంగోలు | 78.71 | 67 | +11.71 |
| రాయదుర్గం | 87.85 | 79 | +8.85 |
| ఎమ్మిగనూరు | 76.4 | 68 | +8.40 |
| పరకాల | 83.98 | 76 | +7.98 |
| పాయకరావుపేట | 85 | 75 | +10.00 |
| మాచర్ల | 82.71 | 75 | +7.71 |
| పోలవరం | 87.09 | 81 | +6.09 |
| రామచంద్రాపురం | 86.48 | 81 | +5.48 |
| ఉదయగిరి | 82 | 73 | +9.00 |
| రాజంపేట | 78.5 | 75 | +3.50 |
| తిరుపతి | 54.69 | 51 | +3.69 |
| రాయచోటి | 79.53 | 77 | +2.53 |
| ఆళ్ళగడ్డ | 82.95 | 78 | +4.95 |
| నర్సాపురం | 88.77 | 87 | +1.77 |
| రైల్వేకోడూరు | 74 | 74 | +0.00 |
| ప్రతిపాడు | 84.39 | 81 | +3.39 |
| నరసన్నపేట | 80.18 | 80 | +0.18 |

చూడాల్సిందే తప్ప మరో మార్గంలేదు. రాజశేఖరరెడ్డి మరణానంతరం కాంగ్రెస్ పార్టీ తీవ్రమైన నాయకత్వ సంక్షోభంలో పడింది. తర్వాత ముఖ్య మంత్రిగా రోశయ్య ఎంతటి అనుభవజ్ఞుడైనప్పటికీ ఆ పార్టీని, శాసనసభ్యుల్ని, మంత్రి వర్గాన్ని ఒక తాటిపై నడిపించ గల సమర్ధతగాని, ప్రజాబలంగాని లేకపోవడంతో హైకమాండ్ అండతో ముఖ్యమంత్రిగా కొనసాగడం తప్ప రాష్ట్రాన్ని పాలించిన దాఖలాలు, ప్రజల విశ్వాసాన్ని పొందిన వైనం మచ్చుకైనా లేకుండా పోయింది. దీనికి తోడు ఒక పక్క ఉధృత స్థాయిలో తెలంగాణ ఉద్యమం, మరోపక్క స్వంత పార్టీలో జగన్ కుంపటి ఆ ప్రభుత్వాన్ని పూర్తిగా నిర్వీర్యం చేశాయి. ఈ ప్రభుత్వం మీద ప్రజలకు విశ్వాసం పూర్తిగా సడలిపోయింది. అధికార పక్షం పాలించలేని స్థితిలో వున్నప్పుడు ప్రధాన ప్రతిపక్షంగా వున్న తెలుగుదేశం పార్టీ ఇబ్బడి ముబ్బడిగా బలాన్ని పెంచుకోవాలి. కాని అప్పటికే రెండు సార్లు ఓటమి పాలైన తెలుగుదేశం పూర్తిగా

డీలా పడింది. పైగా తెలంగాణా సమస్య ఆ పార్టీని మింగుడుపడనిదైంది. 2009 ఎన్నికల్లో రాజశేఖరరెడ్డి "విశ్వసనీయత" అన్న నినాదంతో తెలుగుదేశం పార్టీ మీద దాడిచేశారు. దానిని విశ్వసనీయతలేని పార్టీగా ప్రజలలో ఎండగట్టారు. ఈ పరిస్థితులలో చంద్రబాబు రోజుకో ఆందోళన, పూటకో ఉద్యమం చేపట్టినా ప్రజలలో విశ్వసనీయతని మాత్రం తిరిగి సంపాదించుకోలేక పోతున్నారు.

**అధికార పక్షం పాలించలేని స్థితి, ప్రతి పక్షం విశ్వసనీయతను కోల్పోయి వచ్చిన అవకాశాన్ని అందిపుచ్చుకోలేని స్థితి. ఇదే రాష్ట్ర రాజకీయంలోని విచిత్ర సంక్షోభం. ఒక వికృతమైన రాజకీయ సన్నివేశం. దీంతో ప్రజల భవిష్యత్తుకు భరోసా లేకుండా పోయింది. భవిష్యత్తు అయోమయంగా, అంధకార బంధురంగా వున్నప్పుడు సమాజం తన్నుతాను సంతృప్తి పరుచుకోడానికి, స్వీయ రక్షణ కోసం, భరోసా కోసం వెనక చూపు చూస్తుంది. గత కాలపు వైభవాలకోసం వెదుకు లాడుతుంది. రామరాజ్యాల కోసం, స్వర్ణయుగాల కోసం అర్రులు చాస్తుంది. వీటిని సాధించి పెట్టగల హీరోల కోసం ఎదురుచూస్తుంది.**

ఇలాంటి రాజకీయ సన్నివేశంలో జగన్ ఇచ్చిన రాజన్న రాజ్యం అన్న నినాదం ప్రజల మానసిక స్థితికి అతికినట్టు సరిపోయింది. ముక్కూ, ముఖం తెలియకపోయినా రాజన్న రాజ్యానికి జగన్ వారసుడుగా ప్రజలకు హీరో అయ్యాడు. ప్రజలు ఈ గత కాలపు స్మృతులలోనే తిరుగాడేలా జగన్ తన ఎడతెరిపిలేని ఓదార్పు యాత్రల ద్వారా రాజన్న రాజ్యాన్ని, రాజశేఖరుని విగ్రహారాధనని నిత్యకృత్యం చేసి ఈ వెనుకచూపును ప్రజ్వలింపజేయడంలో సఫలీకృతుడయ్యాడు.

దీనికి తోడు గత 20-30 సంవత్సరాలుగా కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలు పేదరికాన్ని సజీవంగా వుంచుతూనే, జనాకర్షణ పథకాలతో వారిని మచ్చిక చేసుకునే ఓటు బ్యాంకు రాజకీయాన్ని నడిపించారు. **ప్రభుత్వ దయాదాక్షిణ్యాల మీద ఆధారపడే బలహీనులుగా, యాచకులుగా వారిని మార్చారు. ఇలా అస్వతంత్ర జీవనం సాగించే వారు ప్రతిసంక్షోభంలోనూ గత కాలపు అద్భుతాలకు త్వరగా లోనౌతారు.** ఇప్పుడు అదే జరిగింది. ఇందులో జగన్ ప్రతిభ కంటే రాష్ట్రంలో విచిత్రమైన రాజకీయ నేపధ్యంలో పుట్టుకొచ్చిన "వెనక చూపు" ఆయనకు వరంగా మారింది. 'గతకాలమూ మేలు వచ్చుకాలము కంటెన్' అన్న ఒక సనాతన కవివాక్కు అక్షరాల ప్రజల్ని వశీభూతుల్ని చేసింది. అందువల్లనే జగన్ పార్టీ ఏక కాలంలో అటు కాంగ్రెస్, ఇటు తెలుగు దేశం ఓట్లనీ కొల్లగొట్టే శక్తిగా మారింది. 2009లో రాజశేఖర రెడ్డి స్వయంగా సాధించిన ఓట్ల కంటే మించిన ఓట్లు సాధించేది కాగలిగింది. ఈ ఘన విజయానికి ప్రధాన పాత్రధారి అయింది. ఇదే జగన్‌లాంటి అవినీతిపరుణ్ణి, తండ్రి చాటున అధికార దుర్వినియోగంతో అడ్డదారుల్లో కోట్లకు పడగలెత్తినవాణ్ణి ప్రజలు రాజకీయంగా ఆరాధించే స్థితిని కల్పించింది.

ఈ రాజకీయనేపధ్యాన్ని అర్థం చేసుకోకుండా జగన్ విజయం పాలపొంగు లాంటిదని ఈ ఎన్నికలతోనే పోతుందని, ఇదొక సానుభూతి పవనం అనీ అది అంత త్వరగానే అంతరిస్తుందని భావించడం తొందరపాటు అవుతుంది. జగన్‌కు ఇలాంటి శక్తి నిచ్చిన వెనక చూపు రాజకీయ పునాదిని పెకిలించకపోతే 2014 ఫలితాలు ఇదే తీరున ఉన్నా ఆశ్చర్యపోనక్కరలేదు. జగన్‌కు ఇలాంటి శక్తిగా ఎదగడానికి కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీల వైఫల్యాల సంక్షోభమే కారణం. అందుచేత వారు ఈ వికృత రాజకీయానికి పరిష్కారమూ కాదు, ప్రత్యామ్నాయమూ కాదు. ఒక అవినీతిని మరొక అవినీతితో ప్రతిఘటించడం జరిగేది కాదు.

గురజాడ అన్నట్టు మంచిగతమున కొంచెమేనోయ్ మందగించక అడుగుముందుకు వెయ్యాలి. రాష్ట్రంలో ఇలాంటి ముందు చూపునివ్వగల రాజకీయ శక్తులు వున్నాయి. లోక్‌సత్తా, వామ పక్షాలతో పాటు అన్ని పార్టీలలోనూ అవినీతిని, ధనరాజకీయాన్ని వ్యతిరేకించేవారు వున్నారు. అయితే అవి బలహీనంగా వున్నాయి. చెల్లాచెదురుగా వున్నాయి.

**జగన్ పార్టీ వెనక చూపుగల పార్టీ మాత్రమే కాదు అవినీతికీ, అధికార దుర్వినియోగానికి, ధనరాజకీయానికీ ప్రతీక. ఈ వికృత రాజకీయ శక్తి నుండి రాష్ట్రాన్ని విముక్తం చేయడానికి ముందుచూపుగల శక్తులు, అవినీతి రహిత పాలన అందించగల శక్తులు, ప్రజలకు జీవన భద్రతనీ, స్వతంత్ర జీవనాన్ని అందించే శక్తులు ఏకం కావడం తప్ప వేరు పరిష్కారమూ లేదు, ప్రత్యామ్నాయమూ లేదు.** ◆

# జగన్‌ది ఎవరెస్టంత అవినీతి

***"దేశద్రోహులు, ఉగ్రవాదుల కంటే అవినీతిపరులే ఎక్కువ ప్రమాదకారులు. ఉగ్రవాదులు మనుషులను చంపుతుంటే అవినీతిపరులు వ్యవస్థను భ్రష్టుపట్టిస్తూ, రాజ్యాంగాన్ని కాలరాస్తూ... బిడ్డల భవిష్యత్తును అంధకారం చేస్తున్నారు" అని లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ్ మండిపడ్డారు. ప్రజల ఆస్తులను దోచుకుని సొంత సంపదను పెంచుకున్న వాడు ఉగ్రవాదికన్నా ప్రమాదకారి అనే విషయం ప్రజలకు అర్థం కావాలన్నారు. జయప్రకాష్ నారాయణ్ 'ఈనాడు-ఈటీవీ'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.***

- అవినీతిపరుడు ఉగ్రవాదికన్నా ప్రమాదకారి
- లూటీ చేసింది జనం సొమ్మే
- ఈ విషయాన్ని అందరూ గుర్తించాలి
- ప్రజలకు అర్థమయ్యేలా చేసే వరకూ అందరిదీ బాధ్యతే
- కోట్లమంది బిడ్డల భవిష్యత్తును కాలరాశామని విజయమ్మ తెలుసుకోవాలి
- దేశమంతా మాది...దోచుకు తింటామన్నట్లు వ్యవహరించారు
- శిక్షల భయం లేనంత కాలం ఇది పరిస్థితి
- గెలుపుతో అవినీతిని ముడిపెట్టడం మూర్ఖత్వం
- 'ఈనాడు-ఈటీవీ' ఇంటర్వ్యూలో జేపీ



**♦ ప్రజలు నమి అధికారం ఇస్తే విశ్వాసాన్ని, విలువలను కాలరాసి అధికారాన్ని అడ్డం పెట్టుకుని రూ॥వేల కోట్ల ప్రజాధనాన్ని దోచుకున్న వ్యవహారాలను చూస్తుంటే మీకేమనిపిస్తుంది?**

నాయకులు పదవులను అడ్డంపెట్టుకుని అధికారి దుర్వినియోగానికి పాల్పడుతూ అవినీతితో వందలు, వేల కోట్లకు పడగలెత్తుతున్న మాట వాస్తవం. ఈ విధంగా కుళ్లిపోయిన వికృతమైన రాజకీయాలకు జగన్ ఉదంతం పరాకాష్ఠ. తండ్రి అధికారాన్ని అడ్డం పెట్టుకుని ప్రభుత్వ భూములు, ఖనిజసంపద, ఇతర వనరులను కొందరికి దోచిపెట్టి, ప్రతిఫలంగా తమ సంస్థలోకి వందలకోట్లు పెట్టుబడులుగా రాబట్టుకోవడం ద్వారా జగన్ ఘరానా(వైట్‌కాలర్) అవినీతికి పాల్పడ్డారు. ప్రభుత్వ వ్యవస్థలను ప్రైవేటు వ్యక్తుల ప్రయోజనాల కోసం ఏ రకంగా దుర్వినియోగం చేయాలో, ప్రజల ఆస్తులను ఏ రకంగా తమ సొంతం చేసుకోవాలో... అన్ని రకాలుగా పూర్తిస్థాయిలో ప్రయత్నాలు చేశారు. ఏ రకమైన నిర్ణయాలకు ఏ రకంగా డబ్బులు వచ్చాయో స్పష్టమైన ప్రాథమిక సాక్ష్యాధారాలు కనిపిస్తున్నాయి. దేశంలో ఇంతవరకూ ఇలాంటి ప్రయత్నం ఎవరూ చేసి ఉండరు.

**♦ మా నాయకుడొక్కడేనా...! రాజకీయ నేతలందరూ తింటున్నారు కదా? అని అడిగే వాళ్లకు సమాధానం?**

వాళ్లు అలా అడగటం సహేతుకమే. అవినీతి ఊబిలో కూరుకుపోయిన సంప్రదాయ పార్టీల నాయకులు ఎంతోకొంత తింటున్నవాళ్లే. జగన్ వ్యవహారం పరాకాష్ఠ. మాంసం తిని బొమికల్ని కూడా మెడలో వేసుకున్నారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం, విలాసవంతమైన జీవితం కోసం, తమ సొంత ఆస్తులు పెంచుకోవడం కోసం అధికారి దుర్వినియోగానికి పాల్పడి, రూ॥కోట్లు ప్రతిఫలంగా పొందారు. అవినీతిలో ఇది ఎవరెస్ట్. దీన్ని అవినీతి కాదంటే ఎలా? దీన్ని వ్యక్తికి, ప్రభుత్వానికి మధ్య పోరాటంగా భావించకూడదు. అవినీతికి, ప్రజలకు మధ్య పోరాటంగానే చూడాలి. ఒక వ్యక్తి మీద వ్యతిరేకతతో కాకుండా వ్యవస్థలో ఉన్న దుర్మార్గమైన, ఉన్మాదకరమైన పరిస్థితి నుంచి బయటపడేందుకు బృహత్తర పోరాటం అవసరం.

**♦ జగన్ అక్రమాస్తుల కేసులో ఐఏఎస్ అధికారుల పాత్ర కూడా ఉంది కదా?**

అవును... ఐఏఎస్ అధికారుల్లో కొందరు అవినీతిపరులతో

చేతులు కలిపి రాజును మించిన రాజభక్తిని చూపించారు. పాదాక్రాంతులై, సాష్టాంగ నమస్కారం చేసి ఐఏఎస్ వ్యవస్థే నగుబాటయ్యే విధంగా వ్యవహరించిన మాట వాస్తవం. పైవాడు చెప్పాడు కాబట్టి నగుబాటయ్యే విధంగా వ్యవహరించిన మాట వాస్తవం. పైవాడు చెప్పాడు కాబట్టి అక్రమాలకు పాల్పడ్డామన్నది క్షమించదగ్గ వాదన కాదు. రాష్ట్రంలోనే కొందరు అధికారులు కనీసం వందల కోట్లకు పడగలెత్తారనేది వాస్తవం. అధికారులు డబ్బులు తినలేదు.. భయానికి లొంగిపోయామని చెప్పినా కూడా అంతర్జాతీయ న్యాయసూత్రాల ప్రకారం క్షమార్హం కాదు. ప్రజాస్వామ్యాన్ని, ప్రజలను, వ్యవస్థలను కాపాడటం కోసమే ఉన్నతాధికారులకు చట్టబద్ధమైన అధికారాలు, స్వేచ్ఛ ఇచ్చారు. ప్రజాధనానికి రక్షణగా ఉండాల్సిన అధికారులే అవినీతిపరులకు అండగా నిలిచి దేశాన్ని దోచుకోవడానికి ఉపయోగపడుతుంటే ఐఏఎస్‌లు ఎందుకు? అధికారులు కూడా రాజ్యాంగాన్ని ఉల్లంఘించినట్టే కదా!

**♦ అక్రమాస్తుల కేసులో జగన్‌ను అరెస్టు చేయడాన్ని కక్ష సాధింపు చర్య అంటున్నారు?**

అది మన దురదృష్టం. దీనికి ఎవరినో నిందించి ప్రయోజనం లేదు. పరిపక్వత లేని సమాజంలో ఉన్నాం. భూములు, గనులు, తీరప్రాంతాన్ని ఇచ్చేస్తే మనదేం పోయిందని అనుకుంటున్నారే తప్ప ఇది మనది. జాతిసంపద అనుకోవడం లేదు. నా జేబులో సొమ్ములు పోవడం లేదు కదా! అనుకుంటున్నారు. మన ప్రజాస్వామ్యంలో కంచే చేను మేయడం వల్ల, నిప్పుకు చెదలు పట్టడం చేత ఈ ప్రజాస్వామ్యాన్ని ఎవరు బాగుచేయాలో వాళ్లే నాశనం చేస్తుంటే ప్రజలు ఇలా కకావికలురవుతున్నారు. ఓటు ద్వారా మన అధికారంలో కొంతభాగాన్ని నేతలకు ఇస్తున్నామన్న విషయాన్ని ప్రజలు గుర్తించడం లేదు. ప్రజాప్రతినిధులు చట్టానికి బద్ధులుగా, ప్రజలకు జవాబుదారీగా ఉండాలన్న సంగతిని మరచిపోయారు. మేము ఓటేస్తే వాడు రాజవుతాడనే భావన చాలా మందిలో నెలకొంది. కులం, మతం, ప్రాంతం, వర్గ సమీకరణలతో 'మనవాడు' అనే ప్రలోభాలకు లొంగిపోయి సంకుచిత ఆలోచనలతో వాదిస్తున్నారు. దీనికి ఆశ్చర్యపడక్కర్లేదు. జగన్ అయినా, మరొకరైనా లూటీ చేసేది మన సొమ్మే అనే చైతన్యం ప్రజల్లో రావాలి. దోపిడీకి గురైందంతా మన సొమ్మేనని ప్రజలకు అర్థమయ్యే వరకు బాధ్యత గల పత్రికలు, పౌరసమాజం, పార్టీలు వ్యవస్థను బాగు చేయడానికి ముందుకు రావాలి.

**♦ నా కుమారుడు ఏ తప్పూ చేయలేదు. అన్యాయంగా అరెస్టు చేశారంటూ విజయమ్మ జనంలోకి వెళ్లి కన్నీటి పర్యంతమవుతున్నారు కదా?**

తన కుమారుడు తప్పు చేశాడని ఏ తల్లీ చెప్పదు. బిడ్డ హంతకుడైనా, దేశద్రోహి, టెర్రరిస్టు అయినా, అవినీతిపరుడైనా తల్లి బిడ్డపైనే ప్రేమ చూపిస్తుంది. దాన్ని తప్పుపట్టను. విజయమ్మ ఒక పౌరురాలిగా మాట్లాడటం లేదు. ఒక నాయకురాలిగా మాట్లాడటం లేదు. ఓ తల్లిగా మాట్లాడుతోంది. విజయమ్మకు తన కన్నబిడ్డ ఎంతో.. రాష్ట్రంలోని కోట్లాది మంది తల్లులకు వారి బిడ్డలు కూడా అంతే. వాళ్ల భవిష్యత్తును కాలరాసి, వాళ్లకు చెందాల్సిన సంపదను దోచుకుతింటుంటే.. విజయమ్మ తన బిడ్డ మీదున్న ప్రేమతో... కోట్ల మంది బిడ్డల భవిష్యత్తు నాశనం కావాలని కోరుకోవడం సరికాదు. సొంత బిడ్డల కోసం సమాజాన్ని నాశనం చేయడం తగదు. తోటకూర నాడే ఆ తల్లి బిడ్డను గట్టిగా మందలించి ఉంటే నేడు ఈ పరిస్థితి వచ్చేది కాదు.

**♦ సీబీఐ కోర్టు న్యాయమూర్తి పట్టాభిరామారావు ముడుపులు తీసుకుని ఆర్థిక నేరస్తుడు గాలి జనార్ధన్‌రెడ్డికి బెయిల్ మంజూరు చేయడంపై మీరెలా స్పందిస్తారు?**

న్యాయవ్యవస్థలో అన్ని స్థాయిల్లో అవినీతి ఉందన్న ఆరోపణలు

**అధికారాన్ని అడ్డం పెట్టుకుని వనరులను ప్రైవేటు వ్యక్తులకు దోచిపెట్టి ప్రతిఫలంగా డబ్బులు సంపాదించిన వారిని దీర్ఘకాలం జైళ్లలో నిర్బంధించాలి. వారు సంపాదించిందంతా పోయి వారి పిల్లలు బికారులవు తారన్న భయం ఉండాలి. వారి రాజకీయ జీవితం సమాధి కావాలి. ఇలాంటి శిక్షలు ఒక్కొక్క రాష్ట్రంలో అవినీతికి పాల్పడిన రాజకీయ నాయకులు, ఉన్నతాధికారులకు ఏడాదికి కనీసం పది మందికి విధించగలిగితే ఐదారేళ్లలో అవినీతి అనేదేలేకుండా చేయొచ్చు. కఠిన శిక్షలు లేనందువల్లే నాయకులపై ఎన్ని అవినీతి ఆరోపణలొచ్చినా మళ్లీ వాళ్లే ఎమ్మెల్యేలుగా, మంత్రులుగా ఎంపీలుగా, కొన్ని సందర్భాల్లో ముఖ్యమంత్రులుగా కొనసాగుతున్నారు. ప్రజలేమను కుంటారో అన్న వెరపు లేకుండా అక్రమంగా సంపాదించిన ఆస్తులు పెరిగి వారి పిల్లలకు దక్కుతున్నాయి. వారి అక్ర ఆస్తులు ఎక్కడికి పోవడం లేదు... పదవులూ పోవడం లేదు. ఇక వారికి లెక్కేముంటుంది? ఈ ధోరణికి తెరపడాలి.**

వెళ్లువెత్తుతున్నాయి. గాలి జనార్ధనరెడ్డి బెయిల్ కోసం పదుల కోట్లలోనే లంచమిచ్చారు. తీర్పు కోసమైతే వందం కోట్లు ఇచ్చేవారేమో. రాజకీయాలను, ఆర్థిక, న్యాయవ్యవస్థని, పోలీసు యంత్రాంగం మొత్తాన్ని కబళించే వికృత ప్రయత్నం జరిగింది. వాళ్లు చెప్పిందే చట్టం అనే రీతిలో వ్యవహరించారు. ఆధునిక రాచరికాన్ని సృష్టించారు. దీనిపై కచ్చితంగా స్పందించాలి. న్యాయ వ్యవస్థలో మౌలికమైన సంస్కరణలు తీసుకొచ్చి ప్రజలకు మార్గం చూపాలి. కఠినాతికఠినంగా వ్యవహరించకపోతే దేశం నష్టపోతుంది.

**♦ జగన్ అరెస్టుతో ప్రజల్లో సానుభూతి పెరిగి వైకాపా ఎన్నికల్లో ఎక్కువ సీట్లు గెలుపొందుతుందంటున్నారు. సానుభూతి ప్రభావం ఏ మేరకు ఉంటుందనుకుంటున్నారు?**

చూద్దాం... ప్రజాస్వామ్యంలో ఊహాగానాలుంటాయి. ఏం జరుగుతుందో అంచనా వేయడానికి మనమేమీ జ్యోతిష్యులం కాదు. ఈ మధ్య అన్ని చోట్లాప్రజల తీర్పే తెలుస్తుందంటున్నారు. ఉప ఎన్నికల్లో వైకాపా గెలిస్తే మాత్రం... అవినీతి బాగోతాలన్నీ రద్దైపోతాయా? ఓటు వేరు... అవినీతి, నేరాల పట్ల చట్టం వ్యవహరించే తీరు వేరు. ఈ రెండింటినీ ముడిపెట్టడం కన్నా మూర్ఖత్వం మరొకటి లేదు. చట్టం అందరికీ సమానంగానే వర్తిస్తుంది. ఓటు ద్వారా చట్టాన్ని కప్పెట్టేస్తే ఆ దేశంలో నియంతృత్వం వస్తుంది. ఎన్నికల్లో ఎవరు నెగ్గినా నెగ్గకపోయినా అవినీతికి పాల్పడిన వారికి, నేరాలు చేసిన వారికి, దేశద్రోహానికి పాల్పడిన వారికి కఠినమైన శిక్ష విధించాలి. ఎన్నికల్లో ఎమ్మెల్యేగానో, ఎంపీగానో గెలిస్తే మర్డర్లు చేయొచ్చు... ఇతరుల ఆస్తులు దోచుకోవచ్చు.... అంటే అంతకన్నా వికృతమైన పరిస్థితి ఇంకొకటి ఉండదు.

**♦ పార్టీల నుంచి వలసల ప్రభావం రాష్ట్ర రాజకీయాలపై ఏ మేరకు ఉంటుంది?**

ఏ పార్టీకైనా సిద్ధాంతాలు, లక్ష్యాలు, ఆశయాలు, ఆదర్శాలు ఉండాలి. లోక్‌సత్తా, కమ్యూనిస్టు పార్టీలకు తప్ప ఇతర పార్టీలకు అవి ఎక్కడున్నాయి. ఎన్నికల్లో ఎలాగైనా గెలవడమే లక్ష్యంగా పెట్టుకున్న నాయకులు ఫలానా పార్టీలో ఉంటే నెగ్గుతామనే నమ్మకంతో వెళ్లిపోతుండవచ్చు. తమ పార్టీలో గౌరవం లేదనో, సరైన శాఖ ఇవ్వలేదనో వెళ్లిపోతుండవచ్చు. అలాంటి నాయకులకు గౌరవం ఉండదు. రూ॥కోట్లు ఖర్చుపెట్టే బలముండి, నియోజకవర్గంలో నెట్‌వర్క్ ఉంటే ఎక్కడైనా, ఎవరైనా గెలవచ్చనే విశృంఖలమైన ధోరణి పెరిగి పోవడంతో పార్టీలు కకావికలమైపోతున్నాయి. రాష్ట్రంలో పెద్ద పార్టీలైన కాంగ్రెస్, తెదేపా అదే పరిస్థితిలోకి వెళుతుంటే...**అవినీతిలో పుట్టిన వైకాపాపెరిగిపోతుందంటే ఎంత భయంకరమైన పరిణామం? రాజకీయ సంక్షోభానికిది పరాకాష్ఠ. ప్రధాన పార్టీలు ఇప్పటికైనా ఆత్మపరిశీలన చేసుకుని వ్యవస్థను బాగు చేయడానికి నడుం బిగించాలి.**

**♦ ఎమ్మెల్యేలు పార్టీలు ఫిరాయించడం, రాజీనామాలు చేయడం వల్ల రాష్ట్రంలో తరచూ ఉప ఎన్నికలు వస్తున్నాయి. ఇలాంటి పోకడలను నిరోధించేదెలా?**

పదవిలో ఉండగా రాజీనామా చేసి ఉప ఎన్నికలకు కారణమైన ఎమ్మెల్యే మళ్లీ పోటీ చేయకుండా నిషేధం విధించాలి. ఆ పార్టీ తరపున వేరొక వ్యక్తి పోటీ చేసినా ఆ ఎన్నికల ఖర్చును సంబంధిత పార్టీయే భరించచేలా మార్పులు తీసుకురావాలి. ఒక నియోజకవర్గంలో ఎన్నికల నిర్వహణకు నాలుగైదు కోట్ల ప్రజా ధనం ఖర్చవుతుంది. వీళ్ల రాజకీయ క్రీడ కోసం ప్రజల సొమ్ము ఎందుకు ఖర్చుపెట్టాలి? ఈ రెండూ చేస్తే ఉప ఎన్నికలు రావడం తగ్గుతుంది.

**♦ అవినీతి మితిమీరిన నేపథ్యంలో సీబీఐ లాంటి సంస్థలను ఎలా బలోపేతం చేయాలి?**

సీబీఐ చాలా బలహీనమైన సంస్థ. దేశ అవసరాలకు అనుగుణంగా దీన్ని బలోపేతం చేసి స్వతంత్ర ప్రతిపత్తి కల్పించాలి. జిల్లాల్లో న్యాయమూర్తులను ప్రాసిక్యూటర్లుగా నియమించాలి. ప్రత్యేక కోర్టులు పెట్టాలి. ఆస్తులు జప్తు చేసి వాటిని ప్రభుత్వపరం చేసేందుకు బలమైన చట్టాలు కావాలి. ఒక మంత్రినో, ప్రజాప్రతినిధినో విచారించాలంటే ప్రభుత్వ అనుమతి కావాలి. అవినీతిని అరికట్టలేకపోవడానికి కారణమదే. **లోక్‌సత్తా పార్టీ 2జీ కేసులో సుప్రీం కోర్టుకు వెళ్లింది. వందల కోట్లు లంచమిచ్చి స్పెక్ట్రం లైసెన్సులు పొందినవారికి వాటిని దక్కకుండా చేయడంలో విజయం సాధించింది. అదే పద్ధతిని గనులు, తీరప్రాంత, భూముల అక్రమ కేటాయింపులకు వర్తింపజేయాలని మేం చేసిన విజ్ఞప్తిని సుప్రీం కోర్టు ఆమోదించింది. అన్ని రాష్ట్రాల్లో, దేశంలో అది అమలు కావాలి. ఒక పద్ధతి ప్రకారం వ్యవస్థను బాగుచేసుకోవాలి.** ◆

**(ఈనాడు సౌజన్యంతో...)**

# సీపీఎం, లోక్‌సత్తా పార్టీ మధ్య అవగాహనకు ప్రాతిపదిక వుంది

## వైఎస్ హయాంలో జరిగింది లూటీనే




*జగన్ అక్రమాస్తుల కేసులో నిందితులందరికీ శిక్షలు పడేటట్లు చేస్తే అది సంతోషించాల్సిన విషయమేనని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అలా చేస్తుందని అనుకోవడం లేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి బి.వి.రాఘవులు అన్నారు. ఈ అక్రమాల్లో చాలామందికి వాటాలున్నాయని, ఇంకెందరికో సంబంధాలున్నాయని, కాబట్టి వాళ్లను వాళ్లు కాపాడుకోవడం కోసమైనా జగన్‌ను రక్షించే కార్యక్రమాలు మొదలుపెడతారని అభిప్రాయపడ్డారు. "భూములు, గనులు, నీరు, గాలి.. ఇలా ప్రకృతి వనరులన్నింటినీ కొల్లగొడితే రాత్రికి రాత్రే రూ.కోట్లు సంపాదించొచ్చు. అక్రమంగా సంపాదించిన దాంట్లో పించన్ల రూపంలోనే, దానధర్మాల రూపంలోనో కొంత పంచేస్తే జనం కూడా పట్టించుకోరు. ఈ విధంగా ప్రజల నుంచి వెంటనే వ్యతిరేకత రాకుండా, రాత్రికిరాత్రి కోట్ల రూపాయలు సంపాదించడాన్నే లూటీ అంటారు. మన రాష్ట్రంలో వైఎస్ పాలనలో జరిగింది అదే. కర్ణాటకలో యడ్యూరప్ప చేసింది కూడా ఇదే" అన్నారు. రాష్ట్రంలో నెలకొన్న తాజా పరిస్థితుల నేపథ్యంలో ఆయన అభిప్రాయాలు...*

- ఆయన కుటుంబంలో అందరూ లబ్ధిదారులే
- పథకాల పేరుతో ప్రజల దృష్టి మళ్లించారు
- సీఎం పదవి ఇవ్వలేదనే జగన్ సొంత కుంపటి
- కాంగ్రెస్, తెదేపాలు ప్రజా సమస్యలను విస్మరిస్తున్నాయి

**కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చినందుకే తనను వేధిస్తున్నారనే జగన్ ఆరోపణలపై మీ అభిప్రాయం?**

అవినీతి లేకుండానే తన వెంటపడుతున్నారనడం అవాస్తవం. కాంగ్రెస్‌లోనే ఉండి ఉంటే తన అవినీతిని పట్టించుకునేవారు కాదనేది వాస్తవం. జగన్ అక్రమాస్తులపై సీబీఐ విచారణ... అరెస్టు, బెయిల్ ఇవ్వాలా? లేదా..? ఇదంతా కాంగ్రెస్ ఆడుతున్న పెద్ద రాజకీయ నాటకం. అవినీతి మీద పోరాటంగా ప్రజలను మభ్యపెట్టే ఓ ప్రహసనం. కాంగ్రెస్ పార్టీ నిజంగా అవినీతిపై పోరాటం చేసుంటే ఎప్పుడో ఈ అరెస్టులు చేసి ఉండాల్సింది. ఆ 26 వివాదాస్పద జీవోలతో ప్రమేయమున్న మంత్రులందరినీ తొలగించి, అరెస్టు చేసి ఉండాల్సింది. పారిశ్రామికవేత్తలకు ఇచ్చిన 87 వేల ఎకరాల భూములను తిరిగి స్వాధీనం చేసుకోవాల్సింది.

**వైఎస్ హయాంలో జరిగిన అవినీతి కుంభకోణాల్లో లబ్దిదారులెవరు?**

వైఎస్ హయాంలో అవినీతి ద్వారా ఎక్కువ లాభపడింది కాంగ్రెస్ పార్టీ. ఆ పార్టీ అధిష్టానవర్గమే. ఇక్కడ నుంచి పంపించిన డబ్బు సంచులతోనే ఇతర రాష్ట్రాల్లో కాంగ్రెస్ ఎన్నికలను నడిపించి లాభపడింది. రెండో ప్రధాన లబ్ధిదారు వైఎస్ కుటుంబం. కొడుకు జగన్, అల్లుడు అనిల్, ఇంకా బావలు, బావమరుదులు, బంధువులు... ఇలా అందరూ లబ్ధిపొందారు. ఇప్పుడు కాంగ్రెస్‌లో ఉండి అవినీతికి వ్యతిరేకంగా మాట్లాడు తున్న అందరూ మూడో లబ్ధిదారులు.

**భూపోరాటం చేసిన తరహాలో అవినీతిపై వామపక్షాలు ఉద్య మించడం లేదనే చర్చ జరుగుతోంది... దీనిపై మీ స్పందన?**

భూ పోరాటం కూడా ఒక రకంగా అవినీతికి వ్యతిరేకంగా చేసిన ఉద్యమమే. పేదవాడికివ్వడానికి గజం భూమి లేదన్న ప్రభుత్వానికి అదే సమయంలో పారిశ్రామికవేత్తలకు ఇవ్వడానికి మాత్రం వేల ఎకరాలు ఎక్కడి నుంచి వచ్చింది. వాన్‌పిక్ సంస్థకు ఇచ్చిన 23 వేల ఎకరాల్లో సగం డి.ఫారం పట్టాలే. వాటిని చట్టబద్ధం చేసి పారిశ్రామికవేత్తలకు అప్పగించడానికి రాజశేఖర రెడ్డి భూముల చట్టన్నే సవరించారు. అయితే ఇది ఆ రోజు ఎవరికి అర్థం కాలేదు. ఇప్పుడు అర్థమవుతుంది. మేం అప్పుడే ఈ విధానానికి వ్యతిరేకంగా పోరాడాం. నిర్దిష్టమైన అవినీతి కుంభకోణాలపై పోరాడి బాధ్యులకు శిక్ష పడేలా చేయడం పోరాటంలో ఒక భాగం. అవినీతికి పునాది అయిన ప్రైవేటీకరణ. అవినీతిని ప్రోత్సహిస్తున్న కార్పొరేట్ సంస్థకు వ్యతిరేకంగా వామపక్షాలతోపాటు ప్రజాతంత్ర పార్టీలు, స్వచ్ఛంద సంస్థలను కలుపుకుని పోరాటం సాగిస్తాం.

**వైకాపాపై మీ అభిప్రాయం?**

కాంగ్రెస్ ముఠాకుమ్ములాటల్లో భాగంగా పుట్టుకొచ్చిన పార్టీగానే వైకాపాను చూడాల్సి ఉంది. సీఎం పదవి రాలేదు. కాబట్టి జగన్ కాంగ్రెస్ నుంచి బయటకొచ్చి సొంత పార్టీ పెట్టుకున్నారు. సీఎం పదవి వచ్చే అవకాశం లేదు కాబట్టే చిరంజీవి కాంగ్రెస్‌లో చేరారు. రాజశేఖర రెడ్డి ఉన్నంత కాలం కాంగ్రెస్ అధిష్టానానికి అవినీతి కనబడలేదు. కాంగ్రెస్ పుట్టి

మునిగిపోయేలా ఉంది కాబట్టి ఇప్పుడు జగన్ అవినీతి కనబడుతోంది.

**ఉప ఎన్నికల తీరు ఎలా ఉంది?**

ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన అధికార కాంగ్రెస్, సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన తెదేపా ప్రజలను విస్మరించి జగన్ చుట్టూ తిరుగుతుండటం దురదృష్టకరం. రాష్ట్రాన్ని సతమతం చేస్తున్న రాజకీయ సమస్య (తెలంగాణ) గురించి కనీసం ప్రస్తావన కూడా తీసుకురావడం లేదు. సీపీఎం, లోక్‌సత్తా, ఎంసీపీఐ లాంటి పార్టీలు మాత్రమే రాజకీయ సమస్యలను, ప్రజా సమస్యలను ముందుకు తెస్తున్నాయి.

**లోక్‌సత్తా పార్టీతో ఎన్నికల అవగాహనకు ప్రాతిపదిక ఏమిటి? భవిష్యత్తులోనూ ఇది కొనసాగుతుందా?**

**మూడు నాలుగు విషయాల్లో రెండు పార్టీలు మధ్య ఏకీభావం కుదిరింది. అవినీతికి వ్యతిరేకంగా నిలబడి ఉద్యమించడంలో రెండుపార్టీలు గట్టిగా వ్యవహరిస్తున్నాయి. ప్రజాస్వామ్యాన్ని బలహీనం చేసే పద్ధతిలో డబ్బు, మద్యం ఎన్నికలను ప్రభావితం చేస్తున్న నేపథ్యంలో ఎన్నికల సంస్కరణలు, దామాషా పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలని రెండు పార్టీలు కోరుతున్నాయి. ఉద్యమరూపాల్లో వ్యత్యాసాలున్నా అనేక ప్రజలసమస్యలపై పోరాడుతున్నాయి. ఈ కారణాల రీత్యా ఉప ఎన్నికల్లో పరస్పరం మద్దతు, సర్దుబాట్లు చేసుకున్నాం. భవిష్యత్తులో కూడా ప్రధాన సమస్యల విషయంలోను, రాజకీయంగా విభేదాలు లేకపోతే ఇదే విధమైన అవగాహన కొనసాగుతుంది.** ◆

# తప్పెవరిది?

*"కొడుకు చెడుగ్గైన తండ్రి తప్పు*
*కూతురు చెడుగ్గైన తల్లి తప్పు*
*అశ్వము చెడుగ్గైన అశ్వారోహుడి తప్పు*
*ప్రజలు చెడుగ్గైన రాజు తప్పు"*

అవినీతికి కారణం ఎవరు? అనే ప్రశ్న వేసి పాలకులు/ ప్రజలు అనే ఆప్షన్‌లో ఏదైనా ఒకటి టిక్ చేయమంటే నూటికి తొంభై మంది అవినీతికి ప్రజలే కారణమని తేలుస్తున్నారు. ఇందులో కొంత నిజం వున్నా పూర్తిగా నిజం కాదు. ప్రజలు తమ పనులు కావాలంటే ప్రభుత్వంలోని రాజకీయ నాయకులకో, అధికారులకో డబ్బులు ఎక్కువై లంచాలు సమర్పించుకోరు. ఆ పని కావాలంటే ఆశ్రిత పక్షపాతమో, పనిలో జాప్యం జరగక్కుండా వుండడం కోసమో లేకపోతే "క్విడ్‌ప్రోకో" ఇది నాకు అది నీకు అనే సూత్రం ప్రకారం ప్రభుత్వాన్ని ముంచితే మిగిలే సొమ్ములో చెరిసగం పంచుకోవడం కోసమే లంచం ఇస్తారు. కాని ఎక్కువ శాతం లంచాలు ప్రజలు తమకు హక్కుగా లభించాల్సిన సేవల విషయంలోనే ఇవ్వాల్సివస్తుంది. ఏ దిక్కూ లేక ఆ పని కాకపోతే తమ జీవితాల్లో కోల్పోయే నష్టం ఎక్కువైనప్పుడో ఏడుస్తూ కన్నీళ్లు కారుస్తూ తప్పనిసరై లంచాలు ఇవ్వాల్సిన పరిస్థితి ప్రజలకు వస్తుంది. కాని లంచం తీసుకున్నవాడు, ఇచ్చినవాడు కూడా నేరస్థులే అనే నానుడి మనం వాడతాం.

రాజకీయాల్లో అవినీతి గురించి మాట్లాడుతుంటే 'ఎవరు తినలేదండి అంతా ఒక్కటే' అనే నిర్వేదం ఇటీవల ప్రజల్లో కనిపిస్తుంది. 'గురాన్నీ, గాడిదని' ఒకే గాటన కట్టడం అంటే ఇదే. పైగా వీళ్లే మరో మాట అంటారు. మద్యం, డబ్బు తాయిలాలకు ప్రజలు లొంగుతున్నారని, ఓటును అమ్ముకుంటున్నారని వీరు ఆరోపిస్తారు. చివరికి ప్రజలే చెడిపోయారని తేల్చిపారేస్తారు. చెడిపోయింది ప్రజలా? పాలకులా? ఆలోచించాలి. జనరాజకీయం స్థానే ధన రాజకీయాన్ని, అవినీతి రాజకీయాల్ని ప్రవేశపెట్టిన సా.రా. పార్టీలే దీనికి కారణం. ఇటీవల వచ్చిన అదే తాను ముక్క అయిన కొత్త సా.రా. పార్టీ అవినీతిని, ధన రాజకీయాల్ని కలిపి ప్రజలకి తాయిలాలు ఇచ్చే పార్టీగా మారింది. ఈ స్థితిలో ఉప ఎన్నికల ఫలితాలతో ప్రధాన పార్టీల పతనం కొట్టొచ్చినట్టు కనిపించింది.

ఇక ఎన్నికల కమీషన్ విషయానికి వస్తే తాము తీసుకోబోయే చర్యల గురించి ఉత్తరకుమార ప్రగల్భాలు పలికింది. ఎన్నికల ప్రచారంలో ఆఖరి రెండు రోజుల్లో జరిగే ధన ప్రవాహాన్ని మద్యం పంపిణీని అడ్డుకోలేకపోగా ఎక్కడో ఒకటి అరా కేసుల్లో డబ్బు సీజ్ చేసిన దాన్ని గొప్పగా చెప్పుకుంది. సా.రా. పార్టీలు ఒకరి మీద ఒకరు ధన రాజకీయాల గురించి ఫిర్యాదు చేసుకోరు. లోక్‌సత్తా పార్టీ లాంటి పార్టీ ఫిర్యాదులు చేసినా అటు అధికారులు, ఇటు మీడియా దాన్ని లెక్కలోకి తీసుకోవడం లేదు.

ఈ స్థితిలో మనం పునరాలోచించుకోవల్సిన అవసరం వచ్చింది. ప్రజలు చెడిపోయారని, ఆవేదన పడేబదులు దానికి సా.రా. పార్టీలే ఎలా కారణమో ప్రజలకు వివరించాలి. "Try and Try again then you will reach your goal" అన్న సూత్రాన్ని మనం గుర్తుంచుకోవాలి. ఏ సిద్ధాంతమూ లేని వాళ్ళే ప్రజల్లోకి వెళ్ళి తమ వాదనకి మద్దతు కూడగట్టుకుంటుంటే అన్నీ వున్న మనం మన సిద్ధాంతాలకి ప్రజల మద్దతు కూడగట్టుకోవడానికి మళ్ళీ మళ్ళీ ప్రయత్నం చేయాలి, దానికి రాష్ట్రంలో రాజకీయ పునరేకీకరణ జరగాలి. ◆

**- బరామోరా**

# జేపీపై వరవరరావు విజ్ఞత లేని విమర్శ "మాది అహింసాయుత నక్సలిజం"

## : లోక్‌సత్తా పునరుద్ఘాటన

'అవినీతిపరులు ఉగ్రవాదుల కంటే దేశానికి ఎక్కువ ప్రమాదకారులు' అని లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ పదేపదే చేస్తున్న హెచ్చరికను వక్రీకరించి, ఉగ్రవాదుల స్థానంలో నక్సలైట్లనే పదాన్ని పెట్టి వచ్చిన తప్పుడు వార్తలను అడ్డంపెట్టుకుని నిజానిజాలు తెలుసుకోకుండా విప్లవ 'ప్రజాస్వామిక' సంఘటన అధ్యక్షుడు వరవరరావు జేపీపై అనుచిత వ్యాఖ్యలు చేయటాన్ని లోక్‌సత్తా పార్టీ తీవ్రంగా ఖండించింది. జూన్ 7వ తేదీన ఒక పుస్తకావిష్కరణ కార్యక్రమంలో జేపీపై వరవరరావు చేసిన వ్యాఖ్యలకు లోక్‌సత్తా పార్టీ శుక్రవారం నిర్దిష్టమైన సమాధానం ఇచ్చింది.

"అవినీతిపరులు ఉగ్రవాదుల కంటే ప్రమాదకరమని జేపీ ఎప్పట్నుంచో చెబుతున్నారు, ఇటీవల ఒకటికి పదిసార్లు ప్రకటించారు. నక్సలైట్లు అనే పదమే ఆయన ఈ సందర్భంలో ఎక్కడా వాడలేదు. జేపీ మాటలను వక్రీకరించి వైఎస్ జగన్ నక్సలైట్ల కంటే ప్రమాదకారి అని జేపీ చెప్పినట్టు వచ్చిన గాలివార్తలను ఆధారం చేసుకుని, వాస్తవాలను ధృవీకరించుకోకుండా కళ్లకు గంతలు కట్టుకున్నట్టు కువిమర్శలు చేయటం వరవరరావు నిబద్ధతనే ప్రశ్నార్థకం చేస్తోంది" అని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు డి.వి.వి.ఎస్ వర్మ అన్నారు.

"లోక్‌సత్తా పార్టీ ఏనాడూ నక్సలైట్లను, ఉగ్రవాదులను ఒకేగాటన కట్టలేదు. 'మాది అహింసాయుత నక్సలిజం' అని జేపీ చాలాసార్లు ప్రకటించారు" అని వర్మ గుర్తుచేశారు. రాష్ట్రంలో కుళ్లిన అవినీతి రాజకీయానికి జగన్ ఒక సంకేతం మాత్రమేనని, దోపిడీ రాజకీయాన్ని ప్రారంభించిన కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలు కూడా అందులో భాగస్వాములుగా ఉన్నాయని, వ్యక్తుల మీద కన్నా వ్యవస్థీకృత మార్పు కోసం పోరాటమే లోక్‌సత్తా విధానమని స్పష్టంచేశారు.

అలాగే, ఈ దేశంలో ప్రపంచ బ్యాంకు శిక్షణ పొందినవారు ఇద్దరే ఇద్దరు ఉన్నారని వారిలో ఒకరు ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్‌కాగా, రెండవ వ్యక్తి జయప్రకాష్ నారాయణ్ అంటూ వరవరరావు చేసిన విమర్శ కనీస విజ్ఞత కూడా లేనిదని వర్మ అన్నారు.

"ఇద్దరు వ్యక్తులు ప్రపంచబ్యాంకు శిక్షణ పొంది 120 కోట్ల జనాభాగల దేశాన్ని ప్రపంచబ్యాంకు మార్గాన్ని పట్టించారనటం కంటే హాస్యాస్పదమైన రాజకీయ అజ్ఞానం మరొకటి ఉంటుందా?" అని వర్మ ప్రశ్నించారు.

"ప్రపంచబ్యాంకు విధానాల పట్ల లోక్‌సత్తా పార్టీ తన వైఖరిని పదేపదే స్పష్టంచేసింది. పిల్లి నల్లదా తెల్లదా అన్నదాని కంటే అది ఎలుకను పట్టగలదా లేదా అన్నదే గీటురాయిగా ఉండాలని, ప్రపంచబ్యాంకు సహా ఏ సంస్థ విధానాలైనా మనదేశ ప్రయోజనాలకు, ప్రజాసమస్యల పరిష్కారానికి తగినవా లేదా అన్నదే గీటురాయిగా ఉండాలని ప్రకటించింది" అని వర్మ అన్నారు.

ఇకపోతే చట్టబద్ధంగా వనరులను ఎలా దోపిడీ చేయాలో జేపీకి బాగా తెలుసును అంటూ వరవరరావు చేసిన వ్యాఖ్య కువిమర్శకు, సంకుచితత్వానికి పరాకాష్ఠ అని వర్మ అన్నారు. "వాస్తవానికి రాష్ట్రంలో పోర్టులు, సెజ్‌లు, పరిశ్రమల పేరుతో సహజవనరులను ధారాదత్తం చేసిన తీరుపై శాసనసభలో సాక్ష్యాధారాలతో అత్యంత ప్రామాణికంగా తెలియచేసింది జేపీయే. **ప్రజలు తమకు రాజ్యాంగం ప్రసాదించిన ఓటు హక్కుతో ఎన్నుకున్న ప్రతినిధులుండే అసెంబ్లీలను పందుల దొడ్లుగా, వదరుబోతుల దుకాణాలుగా భావించే వరవరరావుకి ఇలాంటివి పట్టవు.** అలాగే 2జీ కుంభకోణంలో సుప్రీంకోర్టుకి వెళ్లి అప్పనంగా దేశవనరుల్ని కొల్లగొట్టిన 122 కంపెనీల లైసెన్సుల్ని రద్దుచేయించటంలో లోక్‌సత్తాదే కీలకపాత్ర. రాజ్యాంగాన్ని, రాజ్యాంగ సంస్థల్ని, చట్టబద్ధ పాలనని, ప్రజాస్వామ్య విలువల్ని పరిరక్షిస్తూ, అవినీతిని అంతం చేయటానికి, అధికారాన్ని వికేంద్రీకరించి జనం చేతికి అధికారం ఇవ్వటానికి, అందరికీ నాణ్యమైన విద్యను, ఆరోగ్యాన్ని, ఉపాధిని అందించటానికి, వ్యవసాయాన్ని లాభసాటి చేయటానికి, గ్రామాలు–పట్టణాల మధ్య అంతరాల్ని తగ్గించటానికి ప్రామాణిక ఎజెండాతో పోరాడుతున్న లోక్‌సత్తా పార్టీ మీద కువిమర్శలు చేయటం ద్వారా పేదలు, అణగారిన వర్గాల ప్రయోజనాలనే తాము కాలరాస్తున్నామని వరవరరావులాంటి వాళ్లు ఇప్పటికైనా గుర్తించాలి" అని డి.వి.వి.ఎస్ వర్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ◆

# తాగినోడి నోట నిజం తన్నుకుని వస్తాదన్నా..

సోయి కథలు

- బండారు రామ్మోహన్ రావు

***ఉప ఎన్నికల నగారా మోగగానే నాకు వరంగల్ జిల్లా పరకాల నియోజకవర్గంలో ప్రచార బాధ్యతల్ని పార్టీ అప్పజెప్పింది. పార్టీ ఆదేశం మేరకు పదిహేను రోజులకుగానూ లగేజీ సర్దుకుని పరకాల పయనమయ్యాను. పరకాలలోనే మకాం. రోజూ ఉదయాన్నే ఆరు గంటలకి బయలుదేరడం, ఆరున్నరకల్లా గ్రామాల్లోకి వెళ్ళి ప్రచారం మొదలుపెట్టడం. మధ్యాహ్నం భోజనానికి పరకాల వచ్చి మళ్ళీ సాయంత్రానికి గ్రామాల బాట పట్టడం. ప్రచారం సమయం ముగిసేవరకు ఉండి పరకాలకు తిరుగుప్రయాణం. గ్రామానికి మేం కార్లో వెళితే వెనక వచ్చిన మా ప్రచార రథం ఊరంతా లోక్‌సత్తా అభ్యర్థికి ప్రచారం చెయ్యడం, ఆ తర్వాత ఆ గ్రామంలోని కూడలిలో నలభై యాభై మంది కనపడితే అక్కడ మైక్‌లో మాట్లాడటం. ఇదీ మా దినచర్య.***

అలా ఓ సాయంత్రం పరకాల నియోజకవర్గంలోని ఓ గ్రామానికి వెళ్ళాం. ఆ ఊరి కూడలిలో మేం వెళ్ళేసరికి అప్పటికే ఒకాయన మాట్లాడుతున్నాడు. జనం అంతా చుట్టూ నిలుచున్నారు. చేతిలో మైక్ లేదు. ఆయన గొంతే మైక్ కన్నా ఎక్కువగా వినిపిస్తుంది. నేను ఆసక్తిగా గమనించాను. ఆయనకు యాభైఏళ్ళ వయసు ఉండవచ్చు. ఆ వ్యక్తి గడ్డం మాసిపోయి, జుట్టు చెదిరిపోయి వుంది. మనిషి సన్నగా రివటలాగా వున్నాడు. తొడుక్కున్న బట్టలు మాసిపోయి వున్నాయి. పొలాల్లోదిష్టిబొమ్మకి తగిలించినట్లుగా ఫ్యాంటు, షర్ట్ ఆయన శరీరానికి వేలాడుతున్నాయి. మెడలో మాసిన తువ్వాలు అప్పుడప్పుడు వచ్చిన చెమటను తుడుచుకుంటున్నాడు. ఫ్యాంటుని ఒక కాలు మోకాలి వరకు మడచుకుని, మరోకాలు ఫ్యాంటు కాలికన్నా పొడవై వీధులూడ్చే పనిచేస్తుంది. ఆయన తలపై వరుసగా రంగు రంగుల టోపీలు వున్నాయి. పరిశీలనగా చూసాను నేను. ఆ టోపీల సందుల్లోంచి వాటి రంగులు కనపడుతున్నాయి. రంగుల్నిబట్టి అవి ఏ పార్టీ టోపీలో పోల్చుకున్నాను. మొదట కాంగ్రెస్ తర్వాత టీడీపి, బిజెపి, టీఆర్ఎస్, ఆఖరున ఈ మధ్యనే వచ్చిన కొత్త పార్టీ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ టోపీ కూడా ఉంది. అన్ని టోపీల్ని ఒకదాని మీద ఒకటి పెట్టుకున్నాడు. ఇంతలో అక్కడికి మా ప్రచార రథం లోక్‌సత్తా ప్రచారం చేస్తూ వచ్చి ఆగింది. ఆ మైక్ చప్పుడుకి మాట్లాడుతున్న వ్యక్తి టక్కున ఆగాడు. మెడలో కండువా, నెత్తిన లోక్‌సత్తా టోపీతో ఉన్న నన్ను చూసి నా దగ్గరికి వచ్చాడు. ఆటెన్షన్‌గా నిలబడి నాకు సెల్యూట్ చేశాడు. కాని ఒక్క రెండు క్షణాలు కూడా ఆయన అలా నిలబడలేక పోయాడు. తూలి పడబోయి పక్కనే విద్యుత్ స్తంభాన్ని పట్టుకుని తమాయించుకుని నిలబడ్డాడు. మనిషి దగ్గరకు రాగానే గుప్పున సారా వాసన వచ్చింది. నాతో మాట్లాడడం మొదలుపెట్టాడు. షార్.. మీ పార్టీ మంచి పార్టీ. జనానికిది పట్టదు. వాళ్ళు డబ్బు షారాకి ఓటు అమ్ముకుంటున్నారు. దొంగలకి 'షద్ది' కడుతున్నారు.వీళ్ళు మీకు ఓటెయ్యరు పొండి. ఓటు అమ్ముకుంటారు అంటూ మళ్ళీ జనంలోకి వెళ్ళాడు. అక్కడ నిలబడ్డ మా కార్యకర్తని అడిగి లోక్‌సత్తా టోపీ కూడా తీసుకుని అన్నిటోపీలకన్నా పైన పెట్టుకుని పాట అందుకున్నాడు. **తాగినోడి నోటి వెంట నిజం తన్నుకుని వస్తాదన్నా....** అంటూ పాట పాడుతూ మాట్లాడడం మొదలుపెట్టాడు. మీ వాళ్ళు ఒట్టి కాగితాలే పంచుతున్నారని, వేరే పార్టీ వాళ్ళు డబ్బు, మద్యం పంచుతున్నారని చెప్పాడు. మా ప్రచార రథం దగ్గరకొచ్చి మైక్ అందుకుని ప్రసంగం మొదలెట్టాడు.



మహాప్రజలారా! షోదరషోదరీ మణులారా! మన ఊళ్ళో ఏం జరుగుతుందో తెలుసా? ఎన్నికల ప్రచారానికి వచ్చిన ప్రతి పార్టీ ఏదేదో చెబుతుంది. నాకు ఒక్క ముక్క కూడా అర్థం

కావడం లేదు. మీకేమన్నా అర్థం అవుతుందా? అని ప్రజల వంక చూసాడు. ఒక్క క్షణం ఆగి మళ్ళీ తనే మొదలుపెట్టాడు. ఇంతలో లోక్‌సత్తా పార్టీ కార్యకర్తలు ఇచ్చిన ఈలలు మోగించుకుంటూ పదిమంది చిన్న పిల్లలు అక్కడికి వచ్చారు. ఈల శబ్దం వినగానే మాట్లాడుతున్న ఆయన కంగారుగా ముఖం పెట్టి 'పోలీస్ పోలీస్' అంటూ అరిచాడు. వెంటనే తేరుకుని 'ఎక్కడి పోలీసులు గ్రామంలో జరుగుతున్న నాటకాలు చూస్తే వాళ్ళకు తెలిసేవి'. వాళ్ళెందుకు వస్తారు అన్నాడు. ఎవరింట్లో మద్యం పార్టీ జరుగుతుందో, ఎవరింట్లో డబ్బు పంపిణీ జరుగుతుందో ఎవరు ఏ పార్టీకి అమ్ముడుపోయారో.. వాళ్ళ పేర్లు చెప్పకనే గ్రామస్థులకి వాళ్ళ పోలికలతో చెప్పాడు. ఎంత బందోబస్తు వున్నా ఎన్నికల్లో జరిగే అక్రమాలన్నీ జరుగుతున్నాయని నిర్వేదం వ్యక్తం చేసాడు. పార్టీలిచ్చే మందు బాటిళ్ళతో ముక్కుపచ్చలారని పోరగాళ్ళు మద్యానికి అలవాటు అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేసాడు. ఓట్ల పండగప్పుడే పార్టీలు ఈ పోరగాళ్ళకి ఎర వేస్తున్నాయని ఓట్ల పండుగ అయిపోయాక వీళ్ళే తమ కష్టార్జితాన్ని పెట్టి బెల్టుషాపుల్లో కొని తాగాల్సివస్తుందని ఆవేదన వ్యక్తంచేసాడు. తను కూడా ఆ బాపేతే అని తేల్చి చెప్పాడు. ఆ ఒక్క ఊళ్ళోనే 50 మంది యువకులు తాగుడుకి, గుట్కాకి బానిసలై లేత వయసులోనే చనిపోయారని వాళ్ళ భార్యలు విధవలయ్యారని కొద్దిసేపు ఏడ్చాడు. వాళ్ళ ఆలనాపాలనా చేసేదెవరని, వాళ్ళ పిల్లల భవిష్యత్ ఏం కావాలని రాజకీయ పార్టీలను ప్రశ్నించాడు. ఊళ్ళో సర్కారు బడి పిల్లలు లేక మూతపడే స్థితిలో వుందని, పిల్లలేమో పరకాల ప్రైవేటు బళ్ళో చదవాల్సి వస్తుందని అన్నాడు. దగ్గూ, పడిశం పట్టినా ప్రైవేటు డాక్టరు దగ్గరకు వెళ్ళాల్సి వస్తుందని ఊళ్ళో వున్న ప్రాథమిక ఆరోగ్యకేంద్రం డాక్టరు లేక మూతపడిందన్నాడు. ఆ ఆస్పత్రి కాస్తా పందుల దొడ్డిగా పేకాటరాయుళ్ళు, తాగుబోతుల అడ్డాగా మారిందన్నాడు.

**ఆయన ప్రసంగం ప్రవాహంలాగా సాగుతుంది. గుర్తు తెచ్చుకోడానికి గుక్క తిప్పుకోడానికి అవకాశం లేకుండా వరుసగా జీవన చిత్రాన్ని ఆవిష్కరిస్తున్నాడు.**

లోక్‌సత్తా కార్యకర్తలు అతన్నించి మైక్ తీసుకోడానికి ప్రయత్నిస్తే నేనే వద్దని సైగ చేశాను. దప్పిక వేసిందేమో ఎదురుగా వున్న కిరణాషాపులో రెండు రూపాయలకు నీళ్ళప్యాకెట్ కొనుక్కుని నోటితో చింపి గడగడ తాగేసి మళ్ళీ మొదలుపెట్టాడు. మన ఊళ్ళో ఊరిపక్క చలివాగులో ఎండాకాలం కూడా 'చెలిమె' తోడుకుంటే దోసిటినిండా నీళ్ళొచ్చేవి. కాని మనిషి నిలువు ఇసుకను దొంగలు తోడుకుపోయారన్నాడు. వాగులో సర్కారు తుమ్మముళ్ళు మొలిచి చలివాగు స్వరూపమే మారిందన్నాడు. ఊళ్ళో ఎక్కడ బోరు వేసినా నీరు పడదని, మంచినీళ్ళు కూడా కొనుక్కోవాల్సి వస్తుందని చెప్పాడు. ఇసుక మాఫియా ఆగడాల గురించి కూడా వివరించాడు. వర్షం వస్తే నిండుగా పొంగే వాగు అసలు పారనైనా పారడం లేదని అన్నాడు. రూపాయికి కిలో బియ్యం ఇచ్చి వంద రూపాయలకు క్వార్టర్ మద్యం అమ్ముతున్నారని, రోజూ కొనుక్కుని తన లాంటి వాళ్ళు ఎలా తాగాలని ఏడ్చాడు. అందరు, అన్ని పార్టీలు జనాకర్షక పథకాలు ప్రవేశపెడుతున్నారని నా వంక తిరిగి **'మీరు రూపాయికి క్వార్టర్ మద్యం ఇస్తామని హామి ఇస్తే ఊళ్ళో వాళ్ళ ఓట్లన్నీ మీకే వేయిస్తానన్నాడు'.** జనానికి తాయిలాలు ఇస్తూ ఊరు పక్కన వున్న కొండను ఎలా తొలిచేస్తున్నారో కూడా సోదాహరణంగా వివరించాడు. ఊరి పక్కన పెద్ద కొండ వుండేదని దాని పలుగురాళ్ళు దేనికో పనికొస్తున్నాయని కొండంతా తొలిచేసారని అన్నాడు. పక్కనే వున్న మరో కొండ నుంచి రాళ్ళని పెద్ద పెద్ద ముక్కలుగా కోసి వాటిని 'రాక్షస లారీ'ల్లోకి ఎక్కించి కాకినాడ తీరానికి తరలిస్తున్నారని చెప్పాడు. ఇసుక, కంకర క్వారీ పనివారి కోసం ఊళ్ళో పన్నెండు బెల్టు షాపులున్నాయిని అవి ఎవరెవరి ఇళ్ళల్లో నడుస్తున్నాయో వీధుల పేర్లతో సహా చెప్పాడు.

**తాగింది దిగింది ఆయన ప్రసంగం పక్కదారి పట్టకముందే మైక్ తీసేసుకున్నాను. ఆయనక్కూడా అలుపువచ్చింది. చావిడి మీది బండరాళ్ళపై కూచుండిపోయాడు. మేం చేద్దామనుకున్న పని తాను పూర్తి చేశాడు. ఊళ్ళో వున్న బడి గురించి, ఆరోగ్యకేంద్రం గురించి, మంచినీటి గురించి మౌలిక వసతుల గురించి తాగుబోతైనా వాస్తవాలని చెప్పాడు. గనులు, ఇసుక మాఫియా గురించి కూడా చెప్పి మన సహజ వనరుల్ని ఎలా దోచుకుంటున్నారో వివరించాడు. ఎన్నికల ప్రచారానికి ఇంకేం కావాలి. అందుకే తాగినోడి నోట నిజం తనుకుని వస్తాదన్నా... అన్న కవి వాక్కూ ఈయన విషయంలో నిజమేననిపించింది. అన్ని ఊళ్ళల్లో ఇలాంటి సామాజిక స్పృహ గల తాగుబోతులు దొరకరు కదా! ఇక మన ప్రచారం మనదే అనుకుంటూ మరో ఊరికి దారితీసాం.** ◆



# మతానికి, ప్రభుత్వానికి మధ్య విభజన రేఖ వుండాలి : జిన్నా

## జిన్నా ప్రసంగం కావాలని ఆలిండియా రేడియోను కోరిన పాక్

***భారతదేశ విభజన తర్వాత నూతనంగా ఏర్పడిన పాకిస్థాన్ రాజ్యాంగ సభలో 1947 ఆగస్టు 11న మహమ్మద్ ఆలీ జిన్నా పాకిస్థాన్ రాజ్యాంగ సభలో ప్రసంగించారు. మనకి ఇప్పుడు పూర్తిగా స్వేచ్ఛ లభించిందని మీరు ఏ మతానికి చెందినా, ప్రభుత్వ కార్యకలాపాలకు మాత్రం మతం, కులం వుండకూడదని పాక్‌లో మత స్వేచ్ఛ వుంటూనే ప్రభుత్వానికి మతానికి స్పష్టమైన విభజన రేఖ ఉండాలని ఆయన కోరారు.***

మహా నేతల ప్రసంగాలు కొన్ని సార్లు చరిత్రగతిని మారుస్తూ ఉంటాయి. తరాలు గడిచిపోయిన తర్వాత కూడా వాటి ప్రభావం కనబడుతూ ఉంటుంది. అలాంటి ఒక ప్రసంగాన్ని పాకిస్థాన్ రాజ్యాంగ సభలో 1947 ఆగస్టు 11న మహ్మద్ ఆలీ జిన్నా చేశారు. పాకిస్థాన్ ఒక లౌకిక దేశమని, అన్ని మతాల ప్రజలకు అక్కడ సముచిత స్థానం ఉంటుందని, అవినీతి రహిత సమాజ నిర్మాణం కోసం ప్రజలందరూ పాటు పడాలనేది ఆ ప్రసంగ సారాంశం. అయితే ఆ ప్రసంగం రికార్డు ప్రస్తుతానికి అల్ ఇండియా రేడియో వద్ద మాత్రమే ఉంది. ఆ ప్రతిని తమకు అందించమంటూ పాకిస్థాన్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్ (పీబీసీ) అల్ ఇండియా రేడియోను కోరింది. ఆ ప్రయత్నాలు ఫలించకపోవడంతో భారత్‌లోని పాక్ హైకమిషనర్ హషీద్ మాలిక్ స్వయంగా రంగంలోకి దిగారు. ఇంతకీ ఆ ప్రసంగంలో ఏముంది? ఆ రికార్డు కోసం ఇంత కాలం తర్వాత పాక్ తన ప్రయత్నాలు ఎందుకు ముమ్మరం చేసింది? అనే ప్రశ్నల వెనుక ఒక ఆసక్తికరమైన కథ ఉంది. భారత ఉపఖండాన్ని రెండుగా విభజించాలన్న బ్రిటిష్ ప్రభుత్వ నిర్ణయంతో రెండువైపులా అల్లర్లు చెలరేగాయి. కోట్లాది ప్రజలు ఒకవైపు నుంచి మరొక వైపునకు తరలిపోవడం మొదలుపెట్టారు. ఈ నేపథ్యంలో 1947 ఆగస్టు 11న పాకిస్థాన్ రాజ్యాంగ సభ కరాచీలో సమావేశమయింది. ఇందులో పాల్గొన్న సభ్యులు మహ్మద్ ఆలీజిన్నాను తమ నాయకుడిగా ఎన్నుకున్నారు. ఈ సమయంలో జిన్నా చేసిన ప్రసంగంలో పాక్ ఒక సెక్యులర్ దేశంగా పరిఢవిల్లాలనే ఆశ స్పష్టంగా కనబడుతుంది. **ప్రభుత్వ కార్యకలాపాలకు, మతానికి, కులానికి, వర్గానికి ఎటువంటి సంబంధం లేదు. అని ఈ ప్రసంగంలో జిన్నా స్పష్టం చేశారు.** అప్పుడు పాక్‌లో లాహోర్, పెషావర్‌లలో మాత్రమే రేడియో స్టేషన్లున్నాయి. అవి 'బి' గ్రేడు స్టేషన్లు. వాటిలో రికార్డింగ్ సౌకర్యం లేదు. దీంతో రాజ్యాంగ సభలో ప్రసంగాలను రికార్డు చేయటానికి ఢిల్లీ నుంచి ఒక టీమ్

అక్కడికి వెళ్లింది. జిన్నా సహా ప్రముఖులు చేసిన ప్రసంగాలన్నింటినీ రికార్డు చేసింది. అవన్నీ అల్ ఇండియా రేడియో దగ్గర భద్రంగా ఉన్నాయి.

**మారిన పరిస్థితులు...**

జిన్నా బతికున్నంత కాలం ఆయన కరిష్మా వల్ల పాక్‌లౌకిక రాజ్యామా? కాదా అనే ప్రశ్న తలెత్తలేదు. ఆయన మరణం తర్వాత పాక్‌ను ముస్లిం రాజ్యాంగా మార్చడానికి ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. రాజ్య లక్ష్యాలను నిర్దేశించే రాజ్యాంగంలో జిన్నా ప్రసంగాన్ని తొలగించి, 1949, మార్చి 12న... ఆబ్జెక్టివ్స్ రిజల్యూషన్‌ను ప్రవేశపెట్టారు. అప్పటికి పాక్ ప్రధాని లియాకత్ అలీఖాన్, పాక్ దశ, దిశలను నిర్దేశించే ఈ తీర్మానంలో లౌకికవాద ప్రసక్తి రాకుండా జాగ్రత్త పడ్డారు. సైనిక పాలకుడు జనరల్ జియా ఉల్ హక్ చేతికి అధికారం చిక్కిన తర్వాత జిన్నా ప్రసంగపు కాపీలు ఎక్కడా లభ్యం కాకుండా చేశారు. ప్రభుత్వం వద్ద ఉన్న కాపీలను కాల్చేశారు. పిల్లల పాఠ్యపుస్తకాల నుంచీ తొలగించారు. తర్వాత వచ్చిన ప్రభుత్వాలు కూడా ఈ ప్రసంగంపై శ్రద్ధ పెట్టలేదు. అఫ్ఘానిస్థాన్‌లో తాలిబన్‌లపై అమెరికా, దాని మిత్ర రాజ్యాలు సైనిక చర్య ప్రారంభించిన తర్వాత పాక్ రాజ్యలక్ష్యాలపై మరోసారి చర్చ ప్రారంభమైంది. ప్రభుత్వానికి మతం దిక్సూచిగా ఉండకూడదని, ప్రజా సంక్షేమమనే లక్ష్యం దెబ్బతింటుందని కొందరు లౌకిక వాదులు గళం విప్పారు.

ప్రస్తుతం పాక్‌లో అధికారంలో ఉన్న పీపుల్స్ పార్టీ జిన్నా ప్రసంగం గుర్తుగా ఆగస్టు 11ను మైనారిటీల దినంగా ప్రకటించింది. ఈ నేపథ్యంలోనే... పాక్ 65 ఏళ్ల క్రితం నాటి జిన్నా ప్రసంగ రికార్డును సేకరించటానికి ప్రయత్నిస్తోంది. ఈ రికార్డు కోసం పాకిస్థాన్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ జనరల్ ముర్తుజా సోలంగి తొలుత బీబీసీని సంప్రదించారు. బీబీసీ ఆర్కైవ్స్‌లో కూడా ఈ ప్రసంగం రికార్డు లేకపోవడంతో ఆలిండియా రేడియో (ఎయిర్)ను సంప్రదించారు. 2011 నవంబరులో న్యూఢిల్లీకి వచ్చినప్పుడు.. ఎయిర్ అంతర్జాతీయ విభాగంలో జిన్నా ప్రసంగం ఉన్నట్టు గుర్తించి ఆ ప్రతిని పొందేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. ◆

## పాకిస్థాన్ ఇన్ ద బ్యాగ్

**పాక్ వ్యవస్థాపకుడు జిన్నాకు ఉర్దూ అనర్గళంగా మాట్లాడటం రాదు. అందువల్ల ఆయన ఎప్పుడూ ఇంగ్లీష్‌లోనే... అది ఆంగ్లేయుల ఉచ్చారణలో ప్రసంగించేవారు. దీంతో ఆయన బాష సామాన్యులకు అర్థమయ్యేది కాదు. పాకిస్థాన్ ఏర్పడినట్లు ప్రకటిస్తూ ఆయన ఆల్ ఇండియా రేడియోలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రసంగం పూర్తయిన తర్వాత 'పాకిస్థాన్ జిందాబాద్' అని గట్టిగా అరిచారు. అది చాలా మందికి అర్థం కాక- 'పాకిస్థాన్ ఇన్ ద బ్యాగ్' అనుకున్నారు.!**

## ప్రసంగంలో ఏముంది?

***పాక్‌లో మత స్వేచ్ఛ ఉండాలనే భావన, మతానికి ప్రభుత్వానికి మధ్య స్పష్టమైన విభజన రేఖ ఉండాలనే ఆకాంక్ష జిన్నా ప్రసంగంలో ప్రముఖంగా కనిపిస్తాయి. ఆ రికార్డులో కొన్ని ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే...***

"మీకు ఇపుడు పూర్తి స్వేచ్ఛ లభించింది. మీరు మీ దేవాలయాలకు స్వేచ్ఛగా వెళ్లవచ్చు. మీ మసీదులకుగానీ మరే ఇతర మందిరాలకుగానీ స్వేచ్ఛగా వెళ్లవచ్చు. మీరు ఏ మాతానికైనా, కులానికి, తెగకైనా చెందిన వారై ఉండచ్చు. కానీ ప్రభుత్వ కార్యాకలాపాలకు మతానికి, కులానికి, తెగకు ఎటువంటి సంబంధం ఉండదు."

"మీరు సర్వస్వతంత్రమైన, సార్వభౌమత్వమున్న సభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారనే విషయాన్ని గుర్తుపెట్టుకోండి. మీకు అన్ని అధికారాలూ ఉన్నాయి. కేవలం అధికారాలు మాత్రమే కాదు, బాధ్యతలు కూడా ఉన్నాయి. దేశంలో శాంతి భద్రతలను కాపాడటమనేది ప్రభుత్వపు తొలి బాధ్యత అనే విషయంపై మీరు నాతో ఏకీభవిస్తారనుకుంటున్నాను. వివిధ మతాలకు చెందిన ప్రజల ప్రాణాలు ఆస్తిపాస్తులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నది."

"నాకు గుర్తుకు వస్తున్న రెండో విషయం గురించి చెబుతాను. ప్రస్తుతం ఇండీయాను పట్టిపీడిస్తున్న మహమ్మారులు రెండు, అవి... లంగచగొండితనం, అవినీతి. ఈ రెండు విష సమానం బ్లాక్ మార్కెటింగ్‌కు, బంధుప్రీతికి వ్యతిరేకంగా ప్రజా ప్రతినిధులు పోరాడాల్సిన అవసరమున్నది."

# పాము చుట్టం - తోక పగ

- మైత్రి

*వైఎస్ రాజశేఖర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీకి ఎంతో సేవ చేశారు. 2004లో అడుగంటిన ఆశకు చిగురు తొడిగారు. పార్టీని అధికారంలోకి తెచ్చారు. ఆయన్ని నమ్ముకుంటే 2009లో మరోసారి అధికారంలోకి తీసుకువచ్చారు. ఆయనంటే మాకు ఎంతో అభిమానం. ఆయన భార్య విజయమ్మ అంటే కూడా మాకు ఎంతో గౌరవం. జగన్ కాంగ్రెస్‌లో వుండి వుంటే కేంద్ర మంత్రో, ముఖ్యమంత్రో అయ్యేవాడు. మా పార్టీ నుండి బయటకు వెళ్ళాడు గనక కష్టపడుతున్నాడు. జగన్ అవినీతిపరుడు., ఆయన అవినీతితో పార్టీకి గాని, రాజశేఖర్ రెడ్డికి గాని ఎలాంటి సంబంధం లేదు. ఇటీవలే ఉప ఎన్నికల సందర్భంగా రాష్ట్రానికి ప్రచారం కోసం కాంగ్రెస్ అధిష్ఠానం పంపించిన పార్టీ పెద్దలు మాట్లాడిన మాటల్లోని కొన్ని అంశాలు..... ఇలా కాంగ్రెస్ వారు సిగ్గూ ఎగ్గూ లేకుండా ప్రచారం చేశారు. దీన్ని చూస్తే 'పాము చుట్టం - తోక పగ' అనే సామెత గుర్తుకు వస్తుంది. రాజశేఖర్ రెడ్డిని మెచ్చుకుంటూనే ఆయన ద్వారా 'క్విడ్‌ప్రొకో' ప్రకారం ఇది నాకు అది నీకు అనే సూత్రాన్ని అమలు వల్ల లాభపడిన జగన్‌ని టార్గెట్ చేస్తూ కాంగ్రెస్ వారు ఎన్నికల ప్రచారం చేశారు. ప్రజలు అర్థం చేసుకున్నారు కనుక జగన్‌ని గెలిపించారు. తండ్రి తప్పుకాదని కాంగ్రెస్ వారే ఒప్పుకున్నారు కనుక ఆ తండ్రిచాటు బిడ్డని జైల్లో వున్నా గెలిపించారు. ఒకరకంగా జగన్‌కి మంచి ప్రచారకర్తలుగా కాంగ్రెస్‌వారే ఉపయోగపడ్డారు.*

**"పాము పగ-తోక చుట్టం"** అనే సామెత తిరగబడింది. కాంగ్రెస్ పార్టీ నుండి వైఎస్‌జగన్ బయటకు వెళ్ళి కాంగ్రెస్ తోక తగిలించి తన తండ్రి పేరుమీద కొత్త పార్టీ స్థాపించారు. కాంగ్రెస్ పార్టీ వారికి జగన్‌ను విమర్శించాలంటే మూలాలు ఇంకెక్కడో కనిపిస్తున్నాయి. తండ్రీకొడుకులు ఒకటై తండ్రి అధికారాన్ని వాడుకుని కొడుకు వ్యాపారాల్లో పెట్టుబడులు పెట్టించుకున్న వైనం కాంగ్రెస్‌కు మింగుడుపడడం లేదు. ఈ అవినీతికి జగనే కారణం అంటున్న కాంగ్రెస్ వారు పైన వున్న వైఎస్ రాజశేఖర్ రెడ్డిని అవినీతిపరుడు అనే సాహసం చేయడం లేదు. తమ పార్టీలో వుండి ఐదేళ్ళకు పైగా ముఖ్యమంత్రిగా చక్రం తిప్పిన రాజశేఖర్ రెడ్డి అవినీతికి పరాకాష్ఠే జగన్ వ్యాపారాలు అనే మాట ఎక్కడా అనకుండా జగన్ మాత్రం తప్పు చేశారని రాజశేఖర్ రెడ్డి మా నాయకుడే అని వెనకేసుకొస్తున్నారు. గల్లీ నుండి ఢిల్లీ వరకు అందరు కాంగ్రెస్ నాయకులదీ ఇదే మాట. **"కోడిగుడ్డును తిన్న పాము తలను ఏమనకుండా తోక మీద ఎంత కొట్టినా గుడ్డు బయటకు రాదు. గుడ్డును బయటకు కక్కించాలంటే పాము నోటి నుండే రావాలి."** రాజశేఖర్ రెడ్డిని విమర్శించాలంటే కాంగ్రెస్ పాలనను కూడా విమర్శించాలి. ఆ పాపంలో భాగస్వాములైన కేబినెట్ మంత్రులు అధికారులు ఇప్పటికే జైళ్ళకు వెళ్ళారు. ఈ అవినీతి డొంక లాగితే తీగంతా బయటపడుతుంది. అందుకే కాంగ్రెస్‌కి రాజశేఖర్ రెడ్డిని విమర్శించాలంటే భయం. ఈ ఎపిసోడ్‌లో ఇంకా ఎంతమంది మంత్రులు, అధికారులు కటకటాలు లెక్కించాల్సి వస్తుందో... అన్న భయం కాంగ్రెస్‌కు ఉంది.

రాజశేఖర్ రెడ్డి 'మహానేత'. కాని 'మహా మేత' మేసింది జగనే అంటున్నారు. 'ఆవు చేలో మేస్తే దూడ గట్టున మేస్తుందా' అనే సామెత మాత్రం కాంగ్రెస్‌వారికి గుర్తురావడం లేదు. రాష్ట్రంలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలన్ని కాంగ్రెస్ పార్టీవే



అని వాదించే కాంగ్రెస్ ఇవే పథకాలు దేశంలో మరే రాష్ట్రంలో ఎందుకు లేవనే జగన్ ప్రశ్నకి సమాధానం చెప్పలేకపోయింది.

కాంగ్రెస్‌లో అంతర్గత ప్రజాస్వామ్యం ఎక్కువని, అన్ని వర్గాల వారు కులాల వారు, మతాల వారు దీన్ని సొంతం చేసుకుంటారని గర్వంగా చెప్పుకునే పార్టీ వారు అవినీతిపరులను కూడా సొంతం చేసుకుంటారనే ప్రజల ప్రశ్నలకి నవ్వి ఊరుకుంటున్నారు. జాతీయ పార్టీగా వ్యవహరించాల్సిన కాంగ్రెస్ రాష్ట్రానికో మాట, ప్రాంతానికోమాట మాట్లాడుతూ ప్రాంతీయ పార్టీలకంటే అధ్వానంగా వ్యవహరించడం వల్లే ఈ ఫలితాలు వచ్చాయి. అవినీతి రాజకీయాలకి పరాకాష్ట కాంగ్రెస్ పార్టీ అయితే జన రాజకీయాల్ని మెల్లమెల్లగా ధన రాజకీయంగా మార్చిన ఘనత తెలుగుదేశం పార్టీది. ఈ రెండు పార్టీల వైఫల్యం ప్రజలను మరోవైపు చూసేలా చేసింది. మొదటినుండి ప్రయత్నిస్తున్న కమ్యూనిస్టు పార్టీలు గత ఆరేళ్ళుగా లోక్‌సత్తా పార్టీ ప్రజలకి ప్రత్యామ్నాయంగా కనిపించలేదు. వాళ్ళ ఆవేశం ఆలోచనను చంపింది. ఎదురుగా కనిపిస్తున్న ప్రత్యామ్నాయం వైపే వాళ్ళు వెళ్ళారు. 'తల పగలగొట్టుకోడానికి ఏ రాయి అయితేనేం' అన్న చందాన వైఎస్ఆర్ పార్టీ వైపు వారు మొగ్గుచూపారు.

**ఈ ఉప ఎన్నికల ఫలితాలు సా.రా. పార్టీలకి ఒక గుణపాఠం కావాలి. రాజకీయాలు ప్రజల్ని ముందుకు తీసుకెళుతున్నాయా? వెనక్కి తీసుకెళుతున్నాయా? ఆలోచించాలి! అలాగే ప్రజలు కూడా పునరాలోచించాలి. ప్రజల ఎజెండాతో ఏ పార్టీలు వస్తున్నాయి, ప్రజల మౌలిక సమస్యలపై ఏ పార్టీలు స్పందిస్తున్నాయి అన్నది ఆలోచించాలి. ఎన్నికలను క్రికెట్ మ్యాచ్‌లాగానో, కోళ్ళ పందాల లాగానో ఆలోచించే మనస్తత్వం నుండి బయటపడాలి. ఎన్నికలబరిలో పోట్లాడుతున్న తోడేళ్ళలో ఏ తోడేలు గెలిచినా చప్పట్లు కొట్టే మేకపిల్లల్ని తినడానికే అన్న నిజాన్ని ప్రజలు తెలుసుకునేలా చేసే బాధ్యత జన రాజకీయం చేసే పార్టీలదే. ప్రజాస్వామ్యంలో అంతిమంగా ప్రజలే న్యాయనిర్ణేతలు. వాళ్ళ విచక్షణను, జ్ఞానాన్ని పెంచే ప్రక్రియను ఎప్పుడికప్పుడు రాజకీయ పార్టీలు చేపట్టాలి.** ◆

# రైతుల నెత్తిన రూపాయి పిడుగు

- **భారీగా పెరిగిన ఎరువుల ధరలు**
- **పొటాష్ బస్తాపై రూ.210 అదనం**
- **డీఏపీ బస్తాపై రూ.110 దాకా**
- **కాంప్లెక్స్ ఎరువులపై రూ.100**
- **రాష్ట్ర రైతులపై రూ.436 కోట్ల భారం**
- **పాతధరలతో ఇప్పుడే కొనుక్కోవడం మేలంటున్న వ్యవసాయ శాఖ**

రూపాయి మారకం విలువ పడిపోతుండటం రైతుల నెత్తిన పిడుగుపాటయింది. ఈ మేర రాయితీ భారాన్ని మోసేందుకు కేంద్రం నిరాకరించడంతో ఎరువుల కంపెనీలు దీనిని సాకుగా చూపి డీఏపీ, కాంప్లెక్స్, పొటాష్ ఎరువుల ధరలు భారీగా పెంచాయి. ఖరీఫ్ సీజన్ మరో పక్షంరోజుల్లో ప్రారంభం కాబోతుండగా ధరల పెంపుదల రైతులపాలిట పెనుభారం కానుంది. ఈ ఖరీఫ్‌లో పంటల సాగువ్యయం మరింత అధికం కానుంది. తాజాగా కాంప్లెక్స్, పొటాష్ ఎరువుల ధరలన్నీ పెంచుతున్నట్లు కోరమండల్ కంపెనీ వ్యవసాయ శాఖకు తెలిపింది. మరోవైపు గత నెల వ్యవస్థలోనే ఐపీఎల్ కంపెనీ పొటాష్ బస్తా ధర గరిష్ఠంగా రూ.630 నుంచి 840 దాకా ఎగబాకింది. తాజాగా ప్రకటించిన ధరల పెంపును మొత్తంగా లెక్కకడితే రైతులపై రూ.436 కోట్ల దాకా అదనపు భారం పడుతుందని తేలింది.

**ఎరువుల ధరల పెరుగుదల తీరు**
(50 కిలోల బస్తాకు రూ.లు)

| కంపెనీ | ఎరువుపేరు | కొత్త ధర | పాతధర |
|---|---|---|---|
| పీపీఎల్ | డీఏపీ | 989.62 | 963.37 |
| ,, | పొటాష్ | 719.25 | 593.25 |
| ఐపీఎల్ | పొటాష్ | 714 | 630 |
| ఫ్యాక్ట్ | పొటాష్ | 630 | 714 |
| కోరమండల్ | పొటాష్ | 834 | 714 |
| ,, | ఎస్.ఎస్.పి | 380 | 355 |
| ,, | 14:28:14 | 1008 | 903 |
| ,, | 14:35:14 | 1039.50 | 924 |
| ,, | 10:26:26 | 976.50 | 840 |
| ,, | 28:28:0 | 1113 | 981.80 |
| ,, | 20:20:0:13 | 866.30 | 777 |
| ,, | 16:20:0:13 | 840 | 756 |

# స్వాతంత్ర్యోద్యమంలో మరో జలియన్ వాలాబాగ్

- జ్వాల

అఖండ భారతదేశం ఆగస్టు 14, 1947న రెండు స్వతంత్ర దేశాలుగా చీలిపోయింది. ఆగస్టు 14న పాకిస్తాన్ అదే రోజు అర్ధరాత్రి తెల్లవారితే 15వ తేది ఇండియా స్వతంత్ర దేశంగా అవతరించాయి. బ్రిటిష్ వారి విభజించు, పాలించు అనే సూత్రం ప్రకారం దేశాన్ని విభజిస్తూనే దేశంలోని 640 పైగా సంస్థానాల్ని కూడా స్వతంత్రంగా నిర్ణయం తీసుకోవచ్చన్నారు. వాళ్ళు ఇండియాలో కాని, పాకిస్థాన్‌లో కాని కలవడానికి వాటికి స్వేచ్ఛ ప్రసాదించారు. భౌగోళికంగా ఈ రెండు దేశాలకు అనుబంధంగా వున్న అన్ని సంస్థానాలు ఇండియాలోనో, పాకిస్థాన్‌లోనో కలిసిపోగా కాశ్మీర్, జునాఘడ్, హైదరాబాద్ సంస్థానాలు ఇండియాలో కలవడానికి నిరాకరించాయి. కాశ్మీర్ సంస్థానంలో కొందరు పాకిస్థాన్‌లో కలవడానికి ఆసక్తి చూపగా, రాజు హరిసింగ్ ఇండియా శరణుజొచ్చారు. దాంతో కాశ్మీర్ ఇండియాలో విలీనం అయింది. అలాగే 'జునాఘడ్' సంస్థానం కూడా ఇండియాలో కలిసింది. ఇక మిగిలింది హైదరాబాద్ రాష్ట్రం. అప్పటికే బ్రిటీష్ ఇండియాతో యధాతధ ఒప్పందం కుదుర్చుకుని స్వతంత్ర దేశంగా వున్న హైదరాబాద్‌కి ఏడవ నిజాం ఉస్మాన్ అలీఖాన్ రాజుగా వున్నాడు. ప్రస్తుత తెలంగాణ జిల్లాలు మొత్తం, ప్రస్తుత మహారాష్ట్రలోని ఔరంగాబాద్, ఉస్మానాబాద్, బీడ్, పర్భనీ, నాందేడ్ జిల్లాలతో పాటు ప్రస్తుత కర్ణాటకలోని బీదర్, గుల్‌బర్గా, రాయచూర్ జిల్లాలు కూడా హైదరాబాద్ రాష్ట్రంలో వుండేవి. దేశమంతటా స్వాతంత్రం వచ్చినా హైదరాబాద్ సంస్థానానికి మాత్రం రాలేదు. ప్రజలు మువ్వన్నెల జెండా ఎగరవేయాలంటే పరాయిదేశంలో వున్నట్టే లెక్క. జాతీయ జెండాను ఆవిష్కరించడం నైజాం పాలనలో నేరమే. ఎందుకంటే అది స్వతంత్ర దేశం కదా!

అప్పటిదాకా ఆరుగురు నిజాంలు మత సామరస్యాన్ని కాపాడగా ఏడవ నిజాం ఉస్మాన్ అలీఖాన్ కూడా ఆ వారసత్వాన్ని పునికి పుచ్చుకున్నారు. కాని పదవి ముందు సిద్ధాంతాలు వ్యక్తిగత ఆశయాలు గాలికిపోయి తన రాజ్యాన్ని నిలువుకోడానికి తాత్కాలికంగా ఆయన మతాన్ని ఆశ్రయించాడు. రాజు ముస్లిం అధిక సంఖ్యాక ప్రజలు

**1956 అక్టోబర్ 31వరకు వున్న హైదరాబాద్ రాష్ట్రం**




**1956 నవంబర్ 1న భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటులో భాగంగా 5 జిల్లాలు మహారాష్ట్రలో కలవగా, మూడు జిల్లాలు కర్ణాటకలో కలిశాయి. తెలుగు మాట్లాడే మిగిలిన 8 జిల్లాలు ఆంధ్రప్రదేశ్‌లో కలిశాయి.**

హిందువులు అయినందున మైనార్టీ ముస్లింలని నాందేడ్‌కు చెందిన 'ఖాశీంరజ్వీ' అనే న్యాయవాది మతోన్మాదానికి గురిచేశాడు. ముస్లింలంటే రాజ్యమేలేవారు. రాజ్యం మన జన్మహక్కు అన్న నినాదాలతో మతోన్మాదాన్ని రగిల్చి దానికి వత్తాసుగా రజాకార్ వ్యవస్థను నెలకొల్పాడు. నిజాం రాజు పాలనను కొనసాగించాలంటే రజాకార్లలో చేరమని పిలుపునిచ్చాడు. 'రజాకార్' అనే ఉర్దూ మాటకి తెలుగులో "స్వచ్ఛంద సేవకుడు" అని అర్థం. కాని స్వచ్ఛంద సేవ ముసుగులో నిజాం రాజ్యాన్ని కాపాడే ఏకైక లక్ష్యంతో గ్రామాలతో సహా రజాకార్ మూకల్ని తయారుచేసాడు. మొదట 90 వేల మందితో ఆరంభమైన ఈ రజాకార్ మూక భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చే నాటికి 5 లక్షలకు చేరింది. ఇది ఇప్పటి బీహార్ రాష్ట్రంలోని ప్రైవేటు సైన్యంలాగా వుండేది. రజాకార్లలో ముస్లింలే కాదు హిందువులు కూడా వున్నారు. నాయకుడు మాత్రం ఖాశీం రజ్వీ. వాళ్ళకి తుపాకులిచ్చారు.

అప్పటికే తెలంగాణా పల్లెల్లో ప్రజల శ్రమను దోచుకుంటూ గ్రామంలోని భూమి అంతా వాళ్ళ ఆధీనంలో వుంచుకుని పేద ప్రజల మీద జులుం చెలాయించే దొరలు, దేశ్‌ముఖ్‌లు, దేశ్‌పాండేలు, జాగీర్దార్లు, మక్తేదార్లు ఇలా అనేక పేర్లతో పిలవబడే స్థానిక నాయకులు రజాకార్లకు మద్దతు ఇచ్చారు. తమ స్థానాల్లో అధికారాన్ని పదిలపరుచుకుంటే తప్ప నిజాం ప్రభువు నిలవలేడని వారు తమ గడీలలో రజాకార్లకి స్థావరం కల్పించారు. వారి తుపాకులతో నైజాంకు వ్యతిరేకంగా జరిగే ఉద్యమాన్ని అణిచివేసారు. ఈ అణిచివేతలో రైతులే కాదు వారి భార్యలు, కన్నెపిల్లల శీలం, దొరల గడీలలో ఆహుతయ్యింది.

ఈ అన్యాయాలని ప్రశ్నించి **'భూమి కోసం, భుక్తి కోసం'**, విముక్తి కోసం ఒక వంక కమ్యూనిస్టులు ఉద్యమించారు. గ్రామాల్లో వీరు ప్రజా సంఘాలు ఏర్పరచారు. అందుకే వీరిని 'సంఘపోళ్ళు' అని పిలిచేవారు. మరోవంక ఆంధ్రమహాసభల స్ఫూర్తితో జాతీయవాద దృక్పథంతో కాంగ్రెస్ ఆశయాలతో మరికొందరు నైజాం నిరంకుశ పాలనను వ్యతిరేకించారు. దేశానికి స్వాతంత్ర్య వచ్చినా కనీసం జాతీయ జెండాను ఎగరవేయడానికి స్వేచ్ఛ లేని పాలనను ఎదిరించారు. అలా రెండు మార్గాలలో తెలంగాణా సాయుధ పోరాటం, జాతీయ ప్రజాస్వామ్య పోరాటం జరిగింది. దీనిలో భాగంగా వరంగల్ జిల్లా పరకాలలో జాతీయ జెండాను ఎగరవేయ పూనుకున్న ఉద్యమకారుల్ని నైజాం ప్రభుత్వం పిట్టల్ని కాల్చినట్లుగా కాల్చిన సంఘటన ఒకటి. అలాగే పరకాలకు దగ్గర్లోని రంగాపురంలో జాతీయ జెండాను ఆవిష్కరించే క్రమంలో ముగ్గురు ఉద్యమకారుల్ని 'నెమిలినార చెట్టు'కు కట్టేసి నరికిన సంఘటన మరువలేనిది. అలాగే వరంగల్ జిల్లాలోనే ప్రస్తుత మద్దూర్ మండలంలో వున్న బైరాన్‌పల్లి గ్రామంలో జరిగిన మారణహోమం దేశంలో మరో జలియన్ వాలాబాగ్‌ను తలపిస్తుంది. గ్రామంలోని కోటగోడకి వున్న నాలుగు ద్వారాల్ని మూసి ప్రజలపై సాగించిన నరమేధంలో తొంభైరెండు మంది చంపబడ్డారు. ఈ రెండు సంఘటనల ప్రతిరూపమే పరకాలలో ఏర్పరచిన అమరధామం. అప్పటి అమరవీరుల త్యాగాలకు నివాళులర్పిస్తూ అమరధామంలో ఆనాటి పోరాటయోధుల శిల్పాలను ఆవిష్కరించారు. రంగాపురంలో జరిగిన మారణహోమం యధాతథ శిల్పంగా ఇక్కడ కనిపిస్తుంది. ఈ రెండు సంఘటనల గురించి చరిత్రలో ఏం జరిగిందో తెలుసుకోడానికి ప్రయత్నిద్దాం...... ◆



# పోరాటాలకు స్ఫూర్తి వీర బైరాన్‌పల్లి

రజాకార్ల మతోన్మాదానికి, నైజాం పాలకుల దుర్నీతికి వ్యతిరేకంగా తెలంగాణ అంతట ప్రజలు తిరగబడ్డారు. దీనికి చేర్యాల ప్రాంతం ఆదర్శప్రాయమైంది. ఈ పోరాటంలో అనేక గ్రామాలు నాశనమయ్యాయి. తల్లిదండ్రులను కోల్పోయిన వారి ఆక్రందనలు, పసుపు, కుంకుమలకు దూరమైన అభాగ్యుల ఆర్తనాదాలు, అందరినీ కోల్పోయి అనాథగా మిగిలిన వారి హాహాకారాలు ఇప్పటికీ చెవుల్లో మారుమోగుతుంటాయి. ఇక్కడి ప్రజలు మొక్కవోని ధైర్యంతో రజాకార్లను, నిజాం సైనికులను తరిమికొట్టారు. తుపాకులు పట్టి శత్రుమూకలతో జరిపిన వీరోచిత పోరాటంలో ఆగస్టు 27, 1948లో 92 మంది మరణించారు. ఈ సంఘటన జరిగి 64 సంవత్సరాలు. 1947 భారతదేశం తెల్లదొరల పాలన నుంచి విముక్తి పొందింది, కానీ హైదరాబాద్ సంస్థానం మాత్రం నిజాం పాలనలో ఉంది.

### గ్రామాలలో రజాకార్ల అరాచకాలు

రజాకార్లు తెలంగాణలోని అనేక గ్రామాలపై విరుచుకుపడి దోపిడీలు, అత్యాచారాలు, హత్యలు యథేచ్ఛగా సాగిస్తుండేవారు. కొన్ని ప్రాంతాల్లో ప్రజలు ధైర్యాన్ని కూడగట్టుకుని ఎదురు తిరిగారు. ఆనాటి సంఘటనలకు నిలువుటద్దమే ఈ మారణ హోమం బైరాన్‌పల్లి ఆనాడు నల్లగొండ జిల్లాలో ఉండేది. ఈ గ్రామం చేర్యాలకు 12 కిలోమీటర్ల దూరంలో ప్రస్తుతం మద్దూరు మండలంలో ఉంది. రజాకార్ల పైశాచిక కృత్యాలు 1857లో బ్రిటీష్ సైన్యాధికారి నిల్ చేసిన ఆగడాలను మించిపోయాయి. నిల్ భారతీయులను చెట్టుకు ఉరితీసేవాడు. అతని మాదిరిగానే ఇక్కడి ఖాసీం రజ్వీ నాయకత్వంలో రజాకార్లు మహిళలను వివస్త్రను చేసి నగ్నంగా బతుకమ్మలు ఆడించిన ఘటనలు ఉన్నాయి.

### రజాకార్ల దుశ్చర్యలను ఖండిస్తే....

శాంతి సంఘం బాధ్యులు శఠగోపాలచార్యులు నాయకత్వంలో సమావేశం నిర్వహించి, వారి ఆగడాలను ఖండించారు. ఆ మరునాడే జనగామ-సిద్దిపేట దారిలో ఆయనను కాల్చిచంపారు. నిజాం రాజు హిందువులకు ఆయుధాల శిక్షణను ఇచ్చి వారితో హిందువులనే కాల్చి చంపించేవారు. ఏడుగురు బ్రాహ్మణులు భోజనం చేసి తిరిగి వస్తుండగా దారిలో శాంతిని రక్షిస్తున్నామని ఐదుగురిని చింతచెట్టుకు వేలాడదీసి కింద మంటలు పెట్టి రజాకార్లు కాల్చిచంపారు. బైరాన్‌పల్లి ప్రజలు ఆనాడు రజాకార్లను ఎదురించి వారి వీరత్వాన్ని చాటుకున్నారు. బైరాన్‌పల్లికి పశ్చిమంగా ఉన్న లింగాపూర్ గ్రామానికి ఒక రోజు రజాకార్లు నిప్పంటించారు. ఈ వార్త విన్న బైరాన్‌పల్లి ఇమ్మడి రాజిరెడ్డి, వంగాల అనంతరెడ్డి, మగులుం రామయ్యతో పాలు మరో



బైరాన్‌పల్లి మారణకాండలో ప్రాణాలతో బయటపడ్డ స్వాతంత్ర్య సమరయోధులు. ఆనాటి సంఘటనకు సజీవసాక్ష్యంగా నిలిచిన బురుజు



ఏడవ నిజాం మీర్ ఉస్మాన్ అలీ ఖాన్

పది మంది కుండలు వగైరా తీసుకుని లింగాపూర్ బయలుదేరారు. వీరంతా వెళ్లేసరికి రజాకార్లు గ్రామంలో దోపిడీ కొనసాగిస్తున్నారు. ధూల్మిట్ట నుంచి 30 మంది కర్రలు, గొడ్డళ్లు తీసుకుని రాగా అప్పనటికే రజాకార్లు దోపిడీ చేసిన సామగ్రిని బండ్లలో వేసుకుని వెళ్లే ప్రయత్నంలో ఉండగా రాజిరెడ్డి బృందం కేకలు వేసుకుంటూ వెంటాడగా రజాకార్లు కాల్పులు జరుపుతూ పారిపోయారు. అయినా నిర్భయంగా వెంటాడుతున్న గ్రామస్తులను చూసి రజాకార్లు పారిపోవడం మొదలు పెట్టారు. దోచుకున్న నాలుగు బండ్ల సామగ్రిని తిరిగి గ్రామస్తులు దక్కించుకున్నారు.

## అబేధ్యమైన బైరాన్‌పల్లి బురుజు

బైరాన్‌పల్లి చుట్టూ కోటగోడ ఉండేది, గోడకు అనుకుని ఎత్తయిన బురుజు ఉండేది. సురక్షితంగా ఎత్తుగా ఉన్న బురుజు గ్రామానికి ఎంతో మేలు చేసేది. ఇదే బురుజుపైన మందుగుండు సామగ్రితో పాటు 24 గంటలు గ్రామస్తుల్లో ఇద్దరు తుపాకులు పట్టుకుని కాపలా కాస్తుండేవారు. రజాకార్లు కనబడితే బురుజుపైన ఉన్న బెజ్జాయి(నగారా) మోగించేవారు. నగారా శబ్ధం వినగానే పరిసర గ్రామాలైన వల్లంపట్ల, కూటిగల్, బెక్కల్, కొండాపూర్, లింగాపూర్, దూల్మిట్ట గ్రామాల ప్రజలు పనులు వదులుకుని 15 నిమిషాల్లో పరుగెత్తుకుని బైరాన్‌పల్లికి చేరుకునేవారు. దీంతో మద్దూరు కేంద్రంలో దాడులు చేయాలనుకున్న రజాకార్లు విఫలమైయ్యారు. కొంతకాలం గడిచిన తర్వాత రజాకార్లు రేబర్తి గ్రామాన్ని కేంద్రంగా చేసుకుని బైరాన్‌పల్లిపై దాడికి దిగారు. వీరిని చూసిన వెంటనే నగారా మోగింది. బురుజుపై నుంచి కాల్పులు మొదలయ్యాయి. రజాకార్లు తట్టుకోలేక బైరాన్‌పల్లి నుంచి పరారయ్యారు. ఆ తర్వాత రజాకార్లు అప్పటి పోలీస్ అమీన్ బైరాన్‌పల్లి బురుజు పైనున్న మందుగుండు సామాగ్రిని పరిశీలించి, రజాకార్లకు, గ్రామస్తులకు రేబర్తి గ్రామంలో దాడి ఆగకపోవడంతో మద్దూరు మండలంలోని పరిసర గ్రామాల ప్రజల ఆత్మరక్షనార్ధం ఆయుధాలు సమకూర్చుకున్నారు.



రజాకార్ నాయకుడు మహమ్మద్ ఖాశీం రజ్వీ

## బైరాన్‌పల్లిలో మారణకాండ 92 మంది కాల్చివేత

అర్ధరాత్రి 500 మంది సైనికులు, పోలీసులు రజాకార్లు ట్రక్కుల్లో జనగామ, సిద్ధిపేట రోడ్డుమీదుగా బయలు దేరారు. నిజాం సైనిక బలగాలు ముస్త్యాల నుంచి వల్లంపట్ల చేరుకుని అక్కడి నుంచి సైన్యాన్ని మళ్లించి అరమైలు పరిధిలో బైరాన్‌పల్లిని చుట్టుముట్టింది. వెంటనే బురుజుపై ఉన్న నగారా మోగింది. చిన్న ఫిరంగి కాల్పులు మొదలయ్యాయి. సైనికుల వద్ద పెద్ద ఫిరంగులు ఉన్నందువల్ల వరుసగా 13 గుళ్లను సైనికులు పేల్చారు. గ్రామంలో అనేక ప్రాంతాల్లో నిప్పంటుకుని కొన్ని ఇళ్లు కాలిపోయాయి. బురుజు పైన ఉన్న ఇద్దరు యువకులు నిలబడి చూస్తుండగా ఫిరంగి గుండు తగలడంతో వారిద్దరు కుప్పకూలిపోయారు. బురుజుపై ఉన్న మందుగుండు సామాగ్రి నిప్పంటుకుని మొత్తం గ్రామ రక్షణ వ్యవస్థ ధ్వంసమైపోయింది. అయినా నిజాం సైన్యం ఫిరంగి కాల్పులను కొనసాగించింది. సైనికులు గ్రామంలోకి చొచ్చుకువచ్చి కనపడినవారిని కనపడ్డట్టు కాల్చిచంపారు. 92 మంది యువకులను ఊరి వెలుపలకు తీసుకువచ్చి వారిని నాలుగు వరుసల్లో నిలబెట్టి కాల్చిచంపారు. దీనికి సైనిక ప్రధానాధికారి ఖాసీం రజ్వీ ప్రధాన పాత్ర పోషించారు. ఈ దారుణ హత్యాకాండను ప్రజలు అసహ్యించుకున్నారు. నిజాం ప్రభుత్వం అప్పట్లో విదేశాల నుంచి పత్రికా విలేకరులను రప్పించి బైరాన్‌పల్లి సంఘటనలను మరో విధంగా చిత్రించి విదేశాల్లో ప్రచారం చేశారు. ◆

# స్ఫూర్తిదాయకం పరకాల అమరధామం

## సెప్టెంబర్ 2 అమరవీరుల సంస్మరణ దినం

హైదరాబాద్ సంస్థానం విమోచనం కోసం జరిగిన స్వాతంత్ర్య పోరాట చరిత్రలో సెప్టెంబర్2, చిరస్మరణీయంగా నిలిచింది. 1948 సెప్టెంబరు 2న పరకాలలో మరో జలియన్ వాలాబాగ్ సంఘటన జరిగిన ఒకే స్థలంలో 13 మంది ప్రాణాలు కోల్పోయారు. అనంతరం మొగుళ్ళపల్లి మండలం రంగాపురం గ్రామంలో ముగ్గురు పోరాట యోధులను చెట్టుకు కట్టేసి కాల్చి చంపారు. ఆనాటి పోరాటయోధుల త్యాగాలు పరకాల, అమరధామం నేటి తరానికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. దేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం వచ్చినా హైదరాబాద్ సంస్థానం పరిధిలోని నేటి తెలంగాణ జిల్లాలు మాత్రం నిజాం నిరంకుశ పాలన కిందకొనసాగాయి. హైదరాబాద్ సంస్థానాన్ని భారతయూనియన్‌లో కలపాలని డిమాండ్ చేస్తూ స్వాతంత్ర్య పోరాటంలో పరకాల ప్రాంతంలో అనేక మంది ప్రాణాలు కోల్పోయారు. ఉద్యమంలో భాగంగా 1947 సెప్టెంబరు2న పరకాలలోని విశాల మైదానంలో త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయడానికి ప్రతినబూని వేలాది మంది వివిధ గ్రామాల నుంచి తరలివచ్చారు. ఆ ప్రజలను చూసిన అప్పటి తహసీల్దార్ నిజాం సిపాయిలకు ఖజానా కొల్లగొట్టడానికి వస్తున్నరనే తప్పుడు సమాచారం అందించారు. దీంతో అప్పటి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జీయాఉల్లా విచక్షణా రహితంగా కాల్పులు జరపటం, లాఠీఛార్జి చేయడంలో క్షణాల్లో ఆ ప్రాంతం మరుభూమిగా మారింది. దేశభక్తుల రక్తంతో పరకాల మైదానం రక్తసిక్తమైంది. ఈ సంఘటనలో 13 మంది పోరాట యోధులు అక్కడికక్కడే మృతి చెందారు. వందలాది మంది క్షతగాత్రులయ్యారు. ఆ రోజు జరిగినకసాయి చర్యలో రేగొండ మండలం దమ్మన్నపేట గ్రామస్థులు మంత్రి కేదారి. పోతుగంటి పెద్దులు, కనపర్తి గ్రామస్థులు గజ్జి పర్వతాలు, అవుదాపురం వీరన్న మేకల పోచయ్య, బత్తుల సమ్మయ్య నాగుర్లపల్లె గ్రామస్థుడు కంట అయిలయ్య, రేగొండకు చెందిన దాటిపెల్లి రాజయ్య, గుండారపు కొంరయ్య, చిట్యాల మండల చల్లగరిగె గ్రామస్థులు పూర్ణసింగ్, బాలిగెపు ముసలయ్య, శాయంపేట మండలం గోవిందాపురం గ్రామానికి చెందిన గల్లె కట్టమల్లు ప్రాణాలు కోల్పోయారు. మొగళ్ళపల్లి మండలం రంగాపురం గ్రామానికి చెందిన ఆకుతోట మల్లయ్య, వర్దెల్లి వీరయ్య ఎండీ రాజ్ మహ్మద్‌లను ఒకే చెట్టుకు కట్టేసి రజాకారులు గొడ్డళ్ళతో నరికి, కాల్చిచంపారు. దీంతో ఈ ప్రాంతంలో మరో జలియన్ వాలాబాగ్ దురంతాన్ని తలపింపజేసింది. ఆ తరువాత 1948 సెప్టెంబరు 17న తెలంగాణ ప్రాంతానికి విముక్తి లభించింది. స్వాతంత్ర్యం సిద్ధించాక యోధులు అమరులైన ఆ ప్రదేశంలో వారి జ్ఞాపకార్థం పరకాల నడొబొడ్డున గల అమరవీరుల మైదానంలో అమరవీరుల స్మారకస్థూపం, జ్ఞాన మందిరాలు నిర్మించారు. ఉద్యమకారుల పోరాట చరిత్రను భావితరాలు స్మరించుకోవడం



కోసం చెన్నమనేని చంద్రమ్మ ట్రస్టు ఆధ్వర్యంలో 2003 సెప్టెంబరు 17న అప్పటి కేంద్ర మాజీ మంత్రి సీహెచ్. విద్యాసాగర్‌రావు, అమరధామంను నిర్మించారు. నిజాం మూకల దౌర్జన్య కాండను సాక్షాత్కరించే రీతిలో శిల్పాలు ఆనాటి సంఘటనను తలపింపజేస్తాయి. నిజాం నిరంకుశ పాలనలో జరిగిన అమానుష సంఘటనలకు నిదర్శనంగా రంగాపురం గ్రామంలో ముగ్గురిని ఒకే చెట్టుకు కట్టేసి కాల్చిచంపిన సంఘటన ఈ ప్రాంత ప్రజల్లో చేదుజ్ఞాపకంగా నిలిచిపోయింది. ఈ ప్రాంతంలో పోరాటయోధుల త్యాగాలు ప్రజలు ఏనాటికి మరువకూడదనే ఉద్దేశంతో అమరవీరుల ఊహా చిత్రాలతో నాటి సంఘటనలను కళ్ళకు కట్టినట్లుగా అమరధామంలో చిత్రీకరించారు. ఏటా సెప్టెంబరు 2న పరకాల ప్రాంతంలో ఉన్న సమరయోధులంతా సమావేశమై ఆనాటి పోరాటంలో అసువులు బాసిన యోధులకు స్మరించి నివాళులర్పిస్తారు. ◆

# వరి మద్దతు ధర పెంపు

*కేంద్ర ప్రభుత్వం వరితోపాటు మిగతా పంటలకి మద్దతు ధరలను ప్రకటించింది. ఈ పంటల ఉత్పత్తికి, పెరిగిన ఉత్పత్తి వ్యయానికి ప్రకటించిన మద్దతు ధరకి పొంతన లేదని లోక్‌సత్తా ప్రకటించింది. వాస్తవ సాగు ఖర్చును, ఉత్పత్తి వ్యయాన్ని లెక్కలోకి తీసుకుని దానికి 50% లాభాన్ని జోడించి పంటల మద్దతు ధరను నిర్ణయించాలని స్వామినాథన్ కమీషన్ పేర్కొంది. ఏళ్ళు గడుస్తున్నా ఆ కమీషన్ ప్రతిపాదనలు అమలుకావడం లేదు. వరికి మద్దతు ధర పెంచడం వల్ల బియ్యం ధరలు పెరుగుతాయని ప్రణాళిక సంఘం సభ్యుడు అభిజిత్ సేన్ అంటున్నారు. ఈ నేపథ్యంలో మద్దతు ధరలపై రైతు సంఘం నాయకుడు ఎర్నేని నాగేంద్రనాథ్ వ్యాసాన్ని కూడా దీనితో జతపరుస్తున్నాం.....*

- **క్వింటాలుకు రూ॥170**
- **బోనస్ రూ॥100**
- **వేరుశనగ పెంపు రూ॥1,000**
- **మినుములు రూ॥1,000**
- **పొద్దు తిరుగుడు రూ॥900**
- **నువ్వులు రూ॥800**

ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు వరి కనీస మద్దతు ధరను కేంద్రం రూ॥170 పెంచింది. గత ఏడాది కనీస మద్దతు ధరతో పోల్చుకుంటే సాధారణ. ఎగ్రేడ్... రెండు రకాల పైనా 16 శాతం పెంచింది. దీంతో పాటు క్వింటాలుకు రూ॥100 బోనస్ కూడా ప్రకటించింది. దిగుమతులపై ఆధారపడకుండా, దేశీయంగా ఉత్పత్తి పెంచే లక్ష్యంతో పప్పుధాన్యాలు, నూనెగింజల కనీసమద్దతు ధరను 37 శాతం వరకు పెంచింది. కంది, పెసర ధరల పెంపు నిర్ణయాన్ని మాత్రం వాయిదా వేశారు. కనీస మద్దతు ధర పెంపు వివరాలను ఆర్థికవ్యవహారాల మంత్రివర్గ సంఘం భేటీ అనంతరం హోంమంత్రి చిదంబరం విలేకర్లకు వెల్లడించారు. సాగు ఖర్చులను పరిగణనలోకి తీసుకుని మద్దతు ధరను పెంచాలని వ్యవసాయ ఖర్చులు, ధరల కమిషన్ (సీఏసీపీ) చేసిన సూచనను ప్రభుత్వం ఆమోదించినట్లు ఆయన తెలిపారు. పెరిగిన సాగు ఖర్చులను బట్టి వరి మద్దతు ధర పెంచడం సబబే అయినా... దీని వల్ల మార్కెట్లో బియ్యం ధరలు పెరిగే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.

- **వరి సాగు వ్యయం ఎకరానికి రూ॥28 వేలు**
- **క్వింటా ధాన్యానికి రూ॥2135 ఇవ్వాలని రాష్ట్రం సిఫార్సు**
- **కేంద్రం ప్రకటించింది రూ॥1280**
- **గతేడాదికన్నా రూ॥170 అదనం**
- **సాగుపై ఇక మిగిలేది అప్పులే**

**మద్దతు ధరల వివరాలు (క్వింటాలుకు రూ॥ల్లో)**

| పంట | ప్రస్తుత ధర | పెంపు తర్వాత |
|---|---|---|
| వరి(సాధారణ రకం) | 1,080 | 1,250 |
| వరి (ఎ గ్రేడ్) | 1,110 | 1,280 |
| మినుములు | 3,300 | 4,300 |
| సోయా చిక్కుడు (నల్లరకం) | 1,650 | 2,200 |
| సోయాచిక్కుడు(పసుపుపచ్చరకం) | 1,690 | 2,240 |
| వేరుశనగ | 2,700 | 3,700 |
| పత్తి(మధ్యరకం పింజ) | 2,800 | 3,600 |
| పత్తి (పొడుగు రకం పింజ) | 3,300 | 3,900 |
| పొద్దుతిరుగుడు | 2,800 | 3,700 |
| నువ్వులు | 3,400 | 4,200 |
| రాగులు | 1,050 | 1,500 |
| వలసులు | 2,900 | 3,500 |
| మొక్కజొన్న | 980 | 1,175 |
| సజ్జలు | 980 | 1,175 |
| జొన్నలు | 1,000 | 1520 |
| జొన్నలు (హైబ్రిడ్) | 980 | 1500 |

**వరిధాన్యానికి మద్దతు ధర పెరుగుదల తీరు**

(క్వింటాకు రూ॥లు)

| సంవత్సరం | ఏగ్రేడ్ ధర | సాధారణ రకంధర |
|---|---|---|
| 2003-04 | 580 | 550 |
| 2008-09 | 880 | 850 |
| 2009-10 | 980 | 950 |
| 2010-11 | 1030 | 1000 |
| 2011-12 | 1110 | 1080 |
| 2012-13 | 1280 | 1250 |

(గమనిక : 2009-10లో రూ॥50 బోనస్ అదనంగా ఇచ్చారు)

# ఈ పెంపు ఏ మూలకు?

- ఎర్నేని నాగేంద్రనాథ్

ఖరీఫ్ సాగుకు ఇంకా నారు కూడా పోయకముందే వరి రైతుల ఆశలపై కేంద్రం నీళ్లు చల్లింది. ప్రస్తుత ఖరీఫ్‌లో పండించే ధాన్యానికి ఇవ్వాల్సిన మద్దతు ధరను గతేడాది కన్నా కేవలం రూ॥170 పెంచాలని కేంద్రం నిర్ణయించింది. ఇది రాష్ట్ర రైతులకు ఏమాత్రం సంతోషదాయకం కాదు. పెరిగిన సాగు వ్యయంతో పోలిస్తే ఇది రాష్ట్ర రైతులకు ఏమాత్రం సంతోషదాయకం కాదు. పెరిగిన సాగు వ్యయంతో పోలిస్తే ఇది చాలా తక్కువ. రూ॥170 పెంచామని కేంద్రం చెబుతున్నా వాస్తవానికి పెరిగింది రూ॥90 మాత్రమే. ఎలా అంటే గత ఆర్థిక సంవత్సరాని (2011-12)కి మద్దతు ధరలు ప్రకటించే ముందు 'జాతీయ వ్యయ, ధరల కమిషన్(సీఏసీపీ) క్వింటా ధాన్యం ధరపై కనీసం రూ॥160 పెంచాలని కేంద్రానికి సిఫార్సు చేసింది. ఇందులో రూ॥80 నేరుగా పెంచి, మరో రూ॥80 బోనస్‌గా ఇవ్వమని సూచించింది. కానీ కేంద్రం చివరికి కేవలం రూ॥ 80 మాత్రమే ఇచ్చి బోనస్‌ను ఎగ్గొట్టింది. ఈ బోనస్‌ను ఇవ్వమని ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి సైతం పలుమార్లు కేంద్రాన్ని అడిగినా పట్టించుకోలేదు. అంటే కమిషన్ చెప్పిన ప్రకారం 2011లోనే మరో రూ॥80 అదనంగా రైతులకు రావాల్సి ఉన్నా కేంద్రం నిర్ణయ కారణంగా రాలేదు. ఈ రూ॥80ని ఇప్పుడు పెంచిన రూ॥170లో తీసివేస్తే.. ఈ ఏడాది నికరంగా పెంచింది. రూ॥90 మాత్రమేనని రైతులు వాపోతున్నారు. మరోపక్క ఈ ఏడాది ఈ రూ॥170 పెంపుతో సరిపెట్టకుండా మరో రూ॥100 బోనస్ ఇవ్వాలని కేంద్ర వ్యవసాయశాఖ సూచించింది. దానిపై కేంద్రం ఏమీ చెప్పడం లేదు.

- రెండేళ్ల క్రితం (2010-11)తో ఈ పోలిస్తే ఈ ఏడాదికి క్వింటా ధాన్యంపై పెరిగిన మద్దతు ధర అదనంగా రూ॥250 మాత్రమే. ఇదే కాలవ్యవధిలో ఎకరం వరి సాగువ్యయం అదనంగా రూ॥7031 పెరిగింది. డీఏపీ ఎరువుల బస్తా ధర రూ॥517 నుంచి రూ॥1260కి పెరిగింది. మద్దతుధరకు, సాగువ్యయం పెరుగుదల మధ్య ఏమాత్రం పొంతన ఉండటంలేదు.
- రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా కేంద్రానికి ఇటీవల ఇచ్చిన నివేదిక ప్రకారం... ఖర్చులు బాగా పెరిగినందున క్వింటాలు వరి ధాన్యానికి ఏ గ్రేడ్‌కైతే రూ॥2135, సాధారణ రకానికి రూ॥2012 ఇవ్వాలని సిఫార్సు చేసింది. కానీ ఈ సిఫార్సును కేంద్రం ఏమాత్రం పట్టించుకోలేదు.
- కొత్తగా పండించబోయే ధాన్యానికి వచ్చే అక్టోబరు నుంచి క్వింటాలుకు సాధారణ రకానికైతే రూ॥1250, ఏ గ్రేడ్‌కు రూ॥1280 ఇవ్వాలని కేంద్రం నిర్ణయించింది.
- ప్రస్తుతం ఎకరం సాగువ్యయం ఏ గ్రేడ్ అయితే రూ॥28,784, సాధారణ రకమైతే రూ॥27,140 అని వ్యవసాయ శాఖ లెక్కించింది. 2010 ఖరీఫ్‌లో ఏ గ్రేడ్ వరి ఎకరం సాగుకు అయిన వ్యయం సగటున రూ॥21,753 మాత్రమే. అంటే గత రెండేళ్ల వ్యవధిలోనే సాగువ్యయం అదనంగా రూ॥7031 పెరిగింది.
- కూలీల రేట్లు, రవాణా ఖర్చులు, ఇతర వ్యవసాయ సామగ్రి ధరలతో పాటు కౌలు సైతం పెరగడం వల్ల సాగువ్యయం ఏటేటా ఎగబాకుతోంది. వరి నాటు వేసేవారు రోజుకూలీ రూ॥300 నుంచి రూ॥400 దాకా వసూలు చేస్తున్నారు.
- వరి మాత్రమే కాకుండా ఇతర పంటల సాగువ్యయమూ బాగా పెరిగింది. వాటి మద్దతు ధరల పెంపు సైతం అంతంత మాత్రంగానే ఉంది.

ఉదాహరణకు వేరుసెనగలను మార్కెట్‌లో వ్యాపారులు ప్రజలకు క్వింటాను రూ॥8000 నుంచి రూ॥9000 దాకా అమ్ముతున్నారు. కానీ రైతులకు క్వింటాకు రూ॥3700 మాత్రమే మద్దతు ధరగా ఇవ్వాలని కేంద్రం తాజాగా నిర్ణయించింది. ఇక వేరుసెనగ నూనె లీటరు ధరరూ॥110కి చేరింది. రైతులకు మాత్రం దీనికి తగ్గట్టుగా ధర రావడం లేదు.

**12 సార్లు ఎరువుల ధరలు పెరిగాయి.**

గత రెండేళ్లలో 12 సార్లు ఎరువుల ధరలు పెరిగాయి. కానీ ధాన్యానికి కేంద్రం ఇచ్చే మద్దతు వాటి ధరలో సగం పెరగలేదు. కనీసం బోనస్ ఇస్తామన్న హామీ కూడా కేంద్రం ఇవ్వలేదు. అన్ని రకాల వ్యవసాయ ఖర్చులు పెరిగినందున కొత్త మద్దతు ధరలు రైతులకు ఏమాత్రం లాభసాటి కాదు. పైగా ఈ ధరలు 2013 సెప్టెంబరు దాకా అమల్లో ఉంటాయి. అప్పటికి ఇంకా ఖర్చులు పెరుగుతాయి. ఇక రైతులు మరింత నష్టపోతారు. వారిని ఆదుకునేందుకు ఈ ధరలు చాలవు.◆

# కఠిన నిబంధనలతో నిధుల స్వాహాకు అడ్డుకట్ట

- 52 లక్షల మంది కరవు బాధిత రైతుల్లో 10 లక్షల మంది జాడలేదు
- ఖాతాలు తెరిచేందుకు అధికారుల వెతుకులాట
- పంచకుండా మిగిలిన రూ॥1000 కోట్ల సాయం

రైతులకు కరవు పరిహారం పంపిణీలో భారీ లొసుగులు బయట పడుతున్నాయి. పరిహారం నిధులు ప్రభుత్వం విడుదల చేసి రెండు నెలలు పూర్తయిన ఇంకా 30 లక్షల మంది రైతులకు సాయం పంచలేదు. కేంద్ర ప్రభుత్వం పెట్టిన ఓ నిబంధనతో నిధుల స్వాహాకు అడ్డుకట్ట పడింది. రూ॥500 కోట్లు అక్రమార్కుల పరం కాకుండా మిగిలిపోనున్నాయని సమాచారం.

గతేడాది ఖరీఫ్‌లో కరవు కారణంగా 82 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయాయి. 52.56 లక్షల మంది రైతులకు రూ॥1816.91 కోట్లను పెట్టుబడి రాయితీగా రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. మరోపక్క కరవు సాయం కింద నిధులు ఇవ్వమని కేంద్రాన్ని అడిగింది. నష్టపోయిన రైతుల గ్రామం పేరు, అతను పంటవేసిన సాగుభూమి సర్వే నెంబరు, రైతు పేర్లలో జాబితాలు పంపమని కేంద్రం ఆదేశించింది. గతంలో ఈ నిబంధన లేదు. కరవు లేదా వరద సాయం మంజూరైతే గ్రామాలకు నిధులు పంపేవారు. కిందిస్థాయి సిబ్బంది చెక్‌లు రైతుల పేర్లతో రాసిచ్చేవారు. బోగస్ రైతులకు చెక్‌లు ఇస్తున్నారని 2010 వరద సాయం పంపిణీలో బయట పడటంతో ప్రతీ రైతు పేరుతో బ్యాంకులో ఖాతా తెరిచి, ఆన్‌లైన్ ద్వారా సొమ్ము జమ చేయాలని కేంద్రం నిబంధన పెట్టింది.

రాష్ట్ర ప్రభుత్వం రైతులందరికీ కరవు సాయం త్వరగా అందాలని రూ॥1816.91 కోట్లను విడుదల చేస్తూ ఏప్రిల్ 13న ఉత్తర్వులిచ్చింది. మే చివరికల్లా రైతు చైతన్య యాత్రలోనే పంచేయాలని రెవెన్యూ, వ్యవసాయ శాఖలను ఆదేశించింది. జూన్ 13 నాటికి కూడా కేవలం 21.88 లక్షల మంది రైతులకు రూ॥837.40 కోట్లు పంచారు. మొత్తం 52.56 లక్షల మంది రైతులతో బ్యాంకుల్లో ఖాతాలు తెరవాలని, వాటిలోకి నేరుగా నిధులు ఆన్‌లైన్ ద్వారా పంపాలని, తేడాలొస్తే ఖజానా, బ్యాంకు, రెవెన్యూ శాఖల అధికారులపై చర్యలు తప్పవని రాష్ట్ర ప్రభుత్వం హెచ్చరించింది.

### కరువుసాయం పంపిణీ తీరు (రూ॥కోట్లలో)

| జిల్లా | విడుదలైనవి | పంపిణీ అయింది |
|---|---|---|
| అనంతపురం | 398.71 | 226.61 |
| మహబూబ్‌నగర్ | 258.75 | 102.00 |
| ఆదిలాబాద్ | 190.28 | 56.75 |
| కర్నూలు | 141.91 | 28.98 |
| నల్గొండ | 129.75 | 46.73 |
| ఖమ్మం | 111.60 | 67.88 |
| మెదక్ | 106.99 | 57.89 |
| వరంగల్ | 106.32 | 38.13 |
| చిత్తూరు | 75.72 | 47.65 |
| కరీంనగర్ | 71.04 | 53.82 |
| రంగారెడ్డి | 61.93 | 33.34 |
| గుంటూరు | 40.21 | 33.13 |
| కృష్ణా | 30.30 | 19.39 |
| శ్రీకాకుళం | 17.50 | 5.69 |
| విశాఖపట్టణం | 17.50 | 5.69 |
| కడప | 16.32 | 14.51 |
| విజయనగరం | 13.50 | 9.36 |
| తూర్పుగోదావరి | 11.08 | 7.36 |
| నిజామాబాద్ | 5.52 | 4.61 |
| ప్రకాశం | 4.41 | 371 |
| పశ్చిమగోదావరి | 1.60 | 1.15 |

కరవు, వరద బాధితుల జాబితాలను తయారు చేసినప్పుడు స్థానిక రాజకీయ పలుకుబడి, అధికారి ధనదాహం తీవ్రతను బట్టి ఇరవై శాతం వరకు బోగస్ పేర్లు చేరిపోతాయి. ఇప్పుడు బ్యాంకు ఖాతా, ఆన్‌లైన్ జమనిబంధన పెట్టేసరికి బోగస్ పేర్లతో ఖాతాలు తెరిపించడానికి అధికారులు భయపడుతున్నారు. ఒక రైతు పేరుతో ఖాతా తెరిస్తే అతనికి దేశంలో ఎక్కడ మరో ఖాతా ఉన్నా ఆన్‌లైన్ తెలిసేపోతుంది. దాంతో ఒకరి పేరుతో పలు ఖాతాలు తెరిచేందుకు సాహసించడం లేదు. మొత్తం 52.56 లక్షల మంది రైతులకు గాను జూన్ 13 నాటికి 10 లక్షల మంది రైతులు అసలు ఖాతాలే తెరవలేదని తేలింది. ◆

# 'ప్రైవేట్' కు విద్యార్థుల వలస

- **2001-12 మధ్య 19.29% మంది విద్యార్థులు దూరం**
- **తక్కువ మంది ఉన్నచోటే ఉపాధ్యాయుల వెంపర్లాట**

ప్రభుత్వ పాఠశాలల నుంచి విద్యార్థులు చేజారిపోతున్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో చేరిపోతున్నారు. 2001-02 నుంచి 2011-12 మధ్య 19.29% మంది విద్యార్థులు సర్కారీ పాఠశాలలకు దూరమై ప్రైవేట్ పాఠశాలలకు దగ్గరైనట్లు రాష్ట్ర విద్యాశాఖ తాజా గణాంకాలే స్పష్టం చేస్తున్నాయి. ఇదే విషయాన్ని వివిధ రకాల అధ్యయనాలు సైతం నిర్ధారిస్తున్నాయి. ఉపాధ్యాయుల నియామకాలు భారీగా జరుగుతున్నందున వారి సంఖ్య మూడు లక్షలు దాటింది. విద్యార్థుల సంఖ్య మాత్రం 1,07,22,425 నుంచి 79,80,052కు తగ్గింది. వచ్చేవారం పునఃప్రారంభంకానున్న విద్యా సంవత్సరాన్ని పురస్కరించుకుని ప్రతి ఏడాది మాదిరిగానే 'బడిబాట' భారీఎత్తున చేపట్టేందుకు విద్యాశాఖ సన్నద్ధమవుతోంది. అయితే ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుకునేలా విద్యార్థులను ఆకర్షించడంలో అధికార యంత్రాంగం విఫలమవుతోంది. అర్హత కలిగిన ఉపాధ్యాయుల ద్వారానే బోధన జరుగుతున్నప్పటికీ విద్యార్థులు బయటకు ఎందుకు వెళ్తున్నారు. వారిని ఇక్కడే ఉంచి తీర్చిదిద్దలేమా? అన్న విషయంపై విద్యాశాఖ కసరత్తు చేయడం లేదు. అలాగే విద్యా ప్రమాణాలను పెంచాల్సిన అధికార యంత్రాంగం, మంత్రులు, క్షేత్రస్థాయి అధికారులు శాఖాపరమైన అంశాలనే పట్టించుకుంటున్నారు. తప్ప విద్యార్థుల చేరికపై దృష్టి పెట్టడం లేదు.

## భారీగా నిధులు

ప్రణాళిక, ప్రణాళికేతర బడ్జెట్ కింద విద్యాశాఖ 2009-10లో రూ.6526.23 కోట్లు వెచ్చించింది. ఈ మొత్తం 2011-12 బడ్జెట్ నాటికి రూ.10 వేల కోట్లు దాటింది. ఈ మొత్తం రాజీవ్ విద్యామిషన్ ప్రతి ఏటా ఖర్చుపెడుతున్న దానికి అదనం. విద్యాహక్కు చట్టం అమల్లో భాగంగా ప్రాథమిక విద్య అభివృద్ధికి కిందటేడాది నాలుగున్నరవేల కోట్ల రూపాయల వరకు కేటాయింపులు జరిగాయి. ఈ ఏడాది బడ్జెట్‌లో ఈ మొత్తం మరికాస్త పెరిగింది. ఇలా నిధులు పెరుగుతున్నా, మధ్యాహ్న భోజన పథకాన్ని, కంప్యూటర్ విద్యా పథకాన్ని, ఉచిత యూనిఫాంల పంపిణీ, పాఠ్య పుస్తకాల ఉచిత పంపిణీ వంటి చర్యలు చేపట్టినా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుతోంది. వేళ్లపై లెక్కబెట్టదగిన విద్యార్థులకు కొన్ని పాఠశాలల్లో ఇద్దరు, ముగ్గురు ఉపాధ్యాయులు ఉన్నారు. ఇలాంటిచోట్ల పనిచేసే ఉపాధ్యాయులు మాత్రమే తమ పోస్టుల నిలకడ కోసం విద్యార్థులను తమ వద్ద చేర్చాలని తల్లిదండ్రుల చుట్టూ తిరుగుతున్నారు. ◆



| సంవత్సరం | సర్కారీ బడుల్లో విద్యార్థులు | శాతం | ప్రైవేట్‌బడుల్లో విద్యార్థులు | శాతం |
|---|---|---|---|---|
| 2001-02 | 1,07,22,425 | 78.88 | 28,70,578 | 21.12 |
| 2002-03 | 1,07,94,293 | 77.67 | 31,02,662 | 22.33 |
| 2003-04 | 1,02,50,658 | 75.77 | 32,78,828 | 24.23 |
| 2004-05 | 98,64,109 | 73.55 | 35,46,959 | 26.45 |
| 2005-06 | 95,03,689 | 70.34 | 40,08,234 | 29.66 |
| 2006-07 | 94,02,889 | 67.88 | 44,48,341 | 32.12 |
| 2007-08 | 89,02,650 | 65.02 | 47,89,091 | 34.98 |
| 2008-09 | 85,85,299 | 62.85 | 50,73,861 | 37.15 |
| 2009-10 | 82,50,134 | 61.72 | 51,16,222 | 38.28 |
| 2010-11 | 80,54,029 | 60.47 | 52,64,157 | 39.53 |
| 2011-12 | 79,80,052 | 59.59 | 54,10,872 | 40.41 |

# ఎన్నికల వ్యవస్థలో మార్పు రావాలి

## అనంతపురం జిల్లా

**రాయదుర్గం** : కేంద్ర, రాష్ట్ర స్థాయిలో ఎన్నికల విధానంలో మార్పు రావాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డా॥జయప్రకాష్‌నారాయణ్ తెలిపారు. రాయదుర్గంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్న ఉప ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు ద్వారా రాజకీయాలను మలుపు తిప్పాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికలు దామాషా పద్ధతిన జరగాలన్నారు. ప్రజాక్షేమం కోసం జాతీయ స్థాయిలో కలిసివచ్చే సిపిఎంతో ఉపఎన్నికల్లో పొత్తు పెట్టుకున్నట్లు తెలిపారు. అవకాశవాద రాజకీయాలను ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాష్ట్రం అవినీతి కేంద్రంగా మారిందన్నారు. రాయదుర్గం, బళ్లారిలు కేంద్ర బిందువులుగా మారాయన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్, టిడిపిలు సంక్షోభంలో పడ్డాయన్నారు. బూజుపట్టిన విధానాలతో కుప్పకూలాయన్నారు. ఇది కేవలం ఒక్క రోజులో జరిగింది కాదన్నారు.

రాష్ట్రంలో అవినీతి అక్రమార్జన, అసమర్ధ పాలన కొనసాగుతోందన్నారు. రాబోవు రోజుల్లో ఇంటికి విద్యుత్ కనెక్షన్ లభించడం కూడా కష్టమవుతుందన్నారు. ప్రధాన పార్టీలు ప్రాంతానికొక మాట చెబుతూ ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ టిడిపి, కాంగ్రెస్ పార్టీల కంటే భిన్నమైనదేమీ కాదన్నారు. ఇదీ కూడా అవినీతి, అక్రమార్జనతో వచ్చిందే అన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం, అవినీతి, మద్యం, తదితర అంశాలల్లో రాజీకయ పార్టీలకు స్పష్టమైన విధానాలు ఉండాలన్నారు. వైఎస్.రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అసెంబ్లీలో గనుల విధానంపై చర్చ జరిగిందన్నారు. అప్పుడే తమ పార్టీ ఈ విషయమై స్పష్టమైన డిమాండ్ చేసిందన్నారు. ఖనిజాలు, సహజ వనరులకు డిమాండ్ ఉన్నప్పుడు వాటికి వేలం నిర్వహించి వచ్చిన ఆదాయాన్ని ఆ వనరులు ఉన్న ప్రాంత అభివృద్ధికి ఖర్చు చేయాలని సూచించామన్నారు. ఉపాధి హామీ చట్టం తీసుకు రావడంలో తమ పార్టీ కృషి ఉందన్నారు. వర్షాభావ జిల్లాలో ప్రతి నీటి చుక్కా సద్వినియోగం చేసేందుకు ఉపాధి నిధులు ఖర్చు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశామన్నారు. రానున్న ఉప ఎన్నికల్లో ప్రజలు ఓటు ద్వారా సరైన నిర్ణయం తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో లోక్‌సత్తా పార్టీ రాయదుర్గం అభ్యర్థి వెంకటరమణ, జిల్లా అధ్యక్షులు శ్రీనాథ్, రాయదుర్గం ఇన్‌ఛార్జి ఈదరచెన్నయ్య, అనంతపురం ఇన్‌ఛార్జి డా॥కొండయ్య, జిల్లా కార్యదర్శి వన్నూరప్ప, కార్యవర్గ సభ్యుడు మహ్మద్‌గౌస్, సిపిఎం పట్టణ కార్యదర్శి పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

### రాయదుర్గాన్ని తిరుపూర్ చేసే నాయకులే లేరా?

**రాయదుర్గం** : తిరుపూర్.. రాయదుర్గం కంటే చిన్నది... అక్కడ గార్మెంట్ పరిశ్రమతో ఎంతో అభివృద్ధి చెందింది. ఎంతో మంది కోటేశ్వరులయ్యారు. దశాబ్దాల క్రితం నుంచి ఉన్న రాయదుర్గం గార్మెంట్ పరిశ్రమ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. చేనేత కార్మికుల ఓట్లు దండుకునే నాయకులు పరిశ్రమ అభివృద్ధిపై దృష్టి సారించటం లేదని జయప్రకాష్ నారాయణ్ విమర్శించారు. స్థానిక లోక్‌సత్తా పార్టీ కార్యాలయంలో మధ్యాహ్నం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

కరువు జిల్లాలో 20 వేల మందికి ఉపాధినిచ్చే రాయదుర్గం గార్మెంట్ పరిశ్రమను మరో తిరుపూర్‌ను చేద్దామనే ఆలోచన నాయకులకు రాకపోవటం శోచనీయమన్నారు. రాయదుర్గం యువత ప్రభుత్వ, నాయకులు ప్రోత్సాహం లేకుండా స్వయం ఉపాధి పొందటం హర్షణీయమన్నారు. ఇక్కడి నాయకులకు మైనింగ్ దోపిడీ విధానంపై ఉన్న శ్రద్ధ ప్రజా సమస్యల విషయంలో లేదన్నారు. కరువు జిల్లాలో భూగర్భజలాలను సద్వినియోగం చేసుకుని పలువురు రైతులు పండ్ల తోటలు సాగుచేయడం హర్షణీయమన్నారు. ప్రతి చిన్న నీటిబొట్టును సద్వినియోగానికి ప్రభుత్వం చర్చలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో లోక్‌సత్తా అభ్యర్థి బి. వెంకటరమణ, జిల్లా అధ్యక్షుడు శ్రీనాథ్, రాయలసీమ ఇన్‌ఛార్జి ఈద చెన్నయ్య జిల్లా కార్యదర్శి వన్నూరప్ప, గౌస్ మహమ్మద్, డాక్టర్ కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

# పరకాల ఎన్నికల అక్రమాలపై లోక్‌సత్తా ఫిర్యాదు

గత పదిరోజులుగా పరకాల ఉప ఎన్నికల ప్రచారంలో "సారా" పార్టీలు (సాంప్రదాయ రాజకీయ పార్టీలు) చేస్తున్న అక్రమాలపై లోక్‌సత్తా పార్టీ ఫిర్యాదు చేసింది. లోక్‌సత్తా పార్టీ అభ్యర్థి గట్టయ్యతో సహా పార్టీ రాష్ట్ర నేతలు పి.కోదండరామారావు, బండారు రామ్మోహన్ రావు, కే.గీతామూర్తి తదితరులు ఎన్నికల పరిశీలకులు వలల్లార్, ఎన్నికల వ్యయపరిశీలకులు అమరేంద్రనారాయణ్‌ను హన్మకొండలోని సర్క్యూట్ గెస్ట్ హౌస్‌లో కలిసి జూన్8న ఒక లిఖిత పూర్వక ఫిర్యాదు చేశారు.

గత రెండురోజులుగా అనుమతి లేని వాహనాలలో సా.రా పార్టీల నాయకులు గ్రామాలలో విస్తృతంగా డబ్బు, మద్యం పంచుతున్నారని, ఇళ్ళలో పదుల సంఖ్యలో వందల సంఖ్యలో జనానికి మద్యం పార్టీలు ఇస్తున్నారని వారు వివరించారు. అభ్యర్థుల వారీగా షాడో పార్టీలు తిరుగుతున్నా అభ్యర్థి ఎన్నికల ప్రచారం మాత్రమే వీడియో తీస్తున్నామని తెర వెనుక జరిగే అక్రమాలను వీరు చిత్రీకరించడం లేదని వారు ఆరోపించారు.

అభ్యర్థుల వ్యయం ఇప్పటికే 16 లక్షలను దాటినా వారు తక్కువ చేసి చూపిస్తున్నారని షాడో పార్టీ వ్యయపరిశీలనకు అభ్యర్థులు వాస్తవంగా చూపినదానికి తేడా గమనించాలని వారు కోరారు. సా.రా పార్టీలకు రిటర్నింగ్ అధికారి పంపిన నోటీసులకు వారు ఇప్పటికీ జవాబు ఇవ్వలేదని వారు తెలిపారు. పార్టీ గుర్తులైన ఫ్యాన్లు ఇతరసామాగ్రి యధేచ్ఛగా పంపిణీ జరగుతుందని వారు ఆరోపించారు. అలాగే యువజన సంఘాలు, కుల సంఘాల ఓట్లు గంపగుత్తగా కొనడానికి ఓరల్ అగ్రిమెంట్లు కుదుర్చుకుని అడ్వాన్సుగా కొంత డబ్బు ముట్టబుతున్నారని వారు వివరించారు. షాడో పార్టీలు నిర్ధారించిన ఎన్నికల ఖర్చును అభ్యర్థుల అసలైన ఎన్నికల ఖర్చుగా పరిగణించి వారిపై వెంటనే చర్య తీసుకోవాలని కోరారు.

### లోక్‌సత్తా అభ్యర్థి భేష్ : సా.రా పార్టీలు బ్యాడ్

**ఈ నెల5వ తేదీ వరకు అభ్యర్థుల ఎన్నికల ఖాతా పరిశీలిస్తే 5 సాంప్రదాయ పార్టీలు చేసిన ఖర్చు ఇప్పటికే మించి పోయింది. 15 లక్షలు 5వ తేది వరకే కొన్ని పార్టీలు దాటాయి. కానీ వాస్తవంగా వారు చూపించినట్టు అందులో 20 శాతం కూడా లేదు. షాడో పార్టీ చూపించిన ఖర్చుకు, పార్టీలు చూపించిన ఖర్చుకు చాలా తేడా వుంది. కానీ లోక్‌సత్తా పార్టీ అభ్యర్థి గట్టయ్య ఈ నెల 5వ తేదిన చూపించిన ఖర్చు 74,421 రూ॥ కాగా షాడో పార్టీ 74,200 రూ॥ మాత్రమే చూపించారు. అభ్యర్థి 200 రూ॥ ఖర్చు ఎక్కువ చూపించారు. దీనికి అధికారులు అభినందించారు. ఇంకా ఎన్నికల నిఘా పెంచాలని, డబ్బు, మద్యం పంపిణీ పూర్తిగా అరికట్టాలని కోరారు.**

### పోల్ చిట్టీలు పంచే పార్టీలను ఆపాలి

పోల్ చిట్టీలను ఎన్నికల కమీషన్ వారే పంపిణీ చేయిస్తుండగా కొన్ని కొన్ని పార్టీలు పోల్ చిట్టాలను తమ గుర్తును కలిపి ముద్రించి పంపిణీ చేస్తున్నారని వారు ఎన్నికల పరిశీలకునికి తెలిపారు. ఇలా పోట్ చిట్టీలలో ఎన్నికల గుర్తు కలిపి పంచడం ప్రజాప్రాతినిధ్య చట్టం (ఆర్.పి.ఆక్ట్) ప్రకారం నేరమని వారు వివరించారు. పోల్ చిట్టీలు ఇంటింటి ప్రచారం నెపంతో డబ్బు మద్యం పంచే పార్టీలను ఆరికట్టాలని, కట్టడి చేయాలని వారు కోరారు.

### తణుకులో ముగిసిన శిక్షణ తరగతులు

**పాతవూరు :** లోక్‌సత్తా పార్టీ ఆధ్వర్యంలో ఏప్రిల్26న ప్రారంభమైన ఉచిత శిక్షణ తరగతులు ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ముగింపు సమావేశంలో లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు యస్. మనోరమ మాట్లాడుతూ వివిధ విభాగాలలో శిక్షణ పొందిన విద్యార్థులు, మహిళలు వాటి ద్వారా మరింత అభివృద్ధి సాధించాలన్నారు. స్పోకెన్ ఇంగ్లీష్, సంస్కృతం, నృత్యం, సంగీతం, క్రాఫ్టులలో తణుకు, అత్తిలి, దువ్వ, ఇతర గ్రామాలకు చెందిన 110 మంది శిక్షణ పొందారు. కార్యక్రమంలో శిక్షకులు ప్రొఫెసర్ డి. కుమారస్వామి, వంగర నారాయణ, నందూరి రాధిక, లక్ష్మీ, డి.కస్తూరి, పార్టీ పట్టణ అధ్యక్షులు డాక్టర్ వి.రామదాసు, కన్వీనర్ మద్దూరి కృష్ణచైతన్య, అత్తిలి మండల అధ్యక్షులు పి. సత్యనారాయణ, బెల్లంకొండ శ్రీనివాసరావు, బొండాడ కృష్ణ, జక్కంపూడి శ్యామ్, తామరవరపు శివశంకర్, సీహెచ్ మల్లిక, ఎన్. దేవి, కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

# ఉప ఎన్నికల ప్రచారంలో జేపీ

















RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2010-12





ఒంగోలు ఉప ఎన్నికల ప్రచారంలో మోటారుసైకిల్ ర్యాలీలో జేపీ తదితరులు

To,

**Book-Post**
PRINTED MATTER

If not delivered please return to:

**Lok Satta Times**
8-2-674B/2/9, Plot No. 93
Happy valley, Road No. 13A
Banjara Hills, Hyderabad - 500 034

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad